

# పల్లె వెలుగు


తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

RNI-APTEL/2012/46499

GST No.37ACDFM5465G1Z1

No: KNL/3`78(D)/2026`2028


రాత్రి వేళల్లో కొనసాగుతున్న
## విజిబుల్ పోలీసింగ్.




Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 207 పేజీలు - 08 వెల - 05/-

శుక్రవారం 24-07-2026


ప్రధాని మోదీ హామీ.. గంటల్లోనే కార్యాచరణ..
# పేపర్ లీకేజీలపై ఉక్కుపాదం

ఫాస్ట్-ట్రాక్ కోర్టుల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు

కొత్త యాంటీ-చీటింగ్ చట్టం కింద పేపర్ లీకేజీ కేసుల విచారణ

దోషులుగా తేలితే 5 ఏళ్ల జైలు, రూ.10 లక్షల వరకు జరిమానా

తొలి దశలో నాలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక కోర్టుల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం

యువత భవిష్యత్తుతో ఆడుకునే వారిని వదిలిపెట్టేది లేదన్న మోదీ

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పేపర్ లీకేజీ కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడేలా, వేగంగా న్యాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. ఈ మేరకు ఫాస్ట్-ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని

మిగతాది 2లో



# పెట్రోల్‌లో 20
## శాతానికి మించి ఇథనాల్..?

● శాస్త్రీయ అధ్యయనాల తర్వాతే నిర్ణయమన్న మంత్రి ● ఈ85 ఇంధనం ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలకే ● ఈ20 వల్ల ఇంజిన్ సమస్యలకు ఆధారాలు లేవన్న సురేశ్ గోపీ ● 20 కోట్ల ద్విచక్ర వాహనాలు, 3 కోట్ల కార్లు ఈ20పై నడుస్తున్నట్లు వెల్లడి ● ఈ20తో కాలుష్యం తగ్గి పనితీరు మెరుగుపడుతుందని స్పష్టీకరణ




పెట్రోల్‌లో ప్రస్తుతం అమల్లో ఉన్న 20 శాతం ఇథనాల్ మిశ్రమాన్ని మరింత పెంచే అంశంపై ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. దీనిపై భవిష్యత్తులో నిర్ణయం తీసుకునే ముందు శాస్త్రీయ అధ్యయనాలు, సాంకేతిక పరిశీలనలు,

మిగతాది 2లో



## డీఆర్‌డీఓ మరో ఘనత..
## 'కుశ' క్షిపణి ప్రయోగం విజయవంతం

● విజయవంతంగా 'కుశ' క్షిపణి తొలి ప్రయోగం ● ఒడిశా తీరంలో పరీక్ష నిర్వహించిన డీఆర్‌డీఓ ● సుదూర గగనతల లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం ● రక్షణ రంగంలో ఇదొక మైలురాయి అన్న రాజ్‌నాథ్ సింగ్

రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) మరో కీలక విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. సుదూర లక్ష్యాలను ఛేదించగల 'కుశ' క్షిపణి (ూ=-ూూవీ) తొలి ప్రయోగాన్ని గురువారం విజయవంతంగా నిర్వహించింది. ఒడిశా తీరంలోని ఏపీజే అబ్దుల్ కలాం ఐలాండ్ నుంచి ఈ పరీక్షను చేపట్టినట్లు డీఆర్‌డీఓ వర్గాలు వెల్లడించాయి. గగనతలంలో అత్యంత వేగంగా, ఎత్తులో ప్రయాణించే ఎలక్ట్రానిక్ లక్ష్యాన్ని అనుకరించి ఈ పరీక్ష నిర్వహించగా, 'కుశ' క్షిపణి దానిని విజయవంతంగా అడ్డగించిందని డీఆర్‌డీఓ ఒక ప్రకటనలో తెలిపింది.

మిగతాది 2లో



## శాంతిభద్రతల
# పరిరక్షణలో రాజీ లేదు: సీఎం



విజయవాడలో ఫ్యూచర్ పోలీసింగ్ కాన్ఫరెన్సులో పాల్గొన్న సీఎం చంద్రబాబు

టెక్నాలజీతో పోలీసింగ్ తీరును మార్చాలని అధికారులకు సూచన

గంజాయి, సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశం

ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు కొందరు నేరాలకు పాల్పడుతున్నారన్న సీఎం

*ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేయడం కోసం, అప్రతిష్ఠ పాలుచేయాలనే లక్ష్యంతో కొన్ని రాజకీయ పార్టీలు ఏకంగా నేరాలు చేయడానికి కూడా వెనుకాడటం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఇలాంటి కుట్రపూరిత చర్యల వల్ల సమాజంలో అశాంతి నెలకొంటుందని, పోలీసులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పాస్టర్ ప్రవీణ్ ఘటనలో జరిగిన దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడానికి నాలుగైదు రోజులు పట్టిందని, సోషల్ మీడియా వేదికగా సాగే ఇలాంటి తప్పుడు ప్రచారాల పట్ల పోలీసులు వేగంగా స్పందించాలని ఆయన ఆదేశించారు.*

విజయవాడలో మూడు రోజులుగా జరిగిన 'ఏపీ పోలీస్ రిట్రీట్ 2026 - ఫ్యూచర్ పోలీసింగ్' సదస్సు ముగింపు కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్ పోలీసింగ్‌కు ఎదురయ్యే సవాళ్లను, వాటిని అధిగమించే వ్యూహాలను వివరించారు. తిరుమల మెట్ల దారిలో అపహరణకు గురైన ఆంజనేయ స్వామి విగ్రహం కేసును ప్రస్తావిస్తూ.. టెక్నాలజీ సాయంతో నిందితుడిని తక్కువ సమయంలోనే పట్టుకున్నారని, అయితే నిందితుడు మానసిక వికలాంగుడైనా, ఇలాంటి ఘటనల్లో వేగంగా చర్యలు తీసుకోకపోతే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళతాయని, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని హెచ్చరించారు. సమాజంలో గంజాయి, డ్రగ్స్ వినియోగం పెను సవాల్‌గా మారిందని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి వల్ల కుటుంబాలకు కుటుంబాలే నాశనమవుతున్నాయని, గంజాయి మత్తులో జరిగే నేరాలను కట్టడి చేయాలని స్పష్టం చేశారు. గంజాయి, డ్రగ్స్‌ను చాలా వరకు నియంత్రించామని, ఇంకా పూర్తి స్థాయిలో అరికట్టాల్సి ఉందని తెలిపారు.

మిగతాది 2లో

## నీట్ నిరసనలు: అల్లర్ల నిందితుల పాస్‌పోర్ట్‌ల రద్దు యోచనలో ఢిల్లీ పోలీసులు

● నీట్ అక్రమాలపై ఢిల్లీలో కొనసాగుతున్న విద్యార్థి నిరసనలు ● ఆందోళనల్లో అల్లర్లకు పాల్పడిన నిందితుల పాస్‌పోర్ట్‌ల రద్దుకు పోలీసుల యోచన ● నిందితులు దేశం విడిచి పారిపోకుండా నిరోధించేందుకు ఈ చర్య ● 'చలో సంసద్' ర్యాలీలో పోలీసులతో ఘర్షణలు జరగడంతో పలువురిపై కేసులు




# ఐదు లక్షల పేద
## కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు: సీఎం

మిగిలిన 30 శాతం చాలా కీలకం అవగాహన లేకున్నా.. ఓటు పోయే ప్రమాదం



- ఆ పార్టీ అవయవదానంతోనే బీజేపీకి అధికారం
- కాంగ్రెస్ ఓటు బ్యాంకును దెబ్బతీయడమే లక్ష్యంగా సర్
- బీజేపీ నేతల మధ్య అంతర్గత ఘర్షణలు
- బీఆర్ఎస్ తప్పులపై ?విచారణ సాగుతోంది

హైదరాబాద్ : నీట్ పేపర్ తో సహా పలు ప్రశ్నాపత్రాల లీకేజీలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని బీఆర్ఎస్ నేతలు ఎందుకు డిమాండ్ చేయడం లేదని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఆయన రాజీనామాను డిమాండ్ చేస్తూ దేశంలోని యువత, విద్యార్థులు, వివిధ తరగతుల ప్రజలు రోడ్లెక్కి నిరసనలు చేస్తుంటే బీఆర్ఎస్ మౌనంగా ఉండటం దేనికి సంకేతం అని నిలదీశారు. అసలు బీఆర్ఎస్, బీజేపీ

మిగతాది 2లో



# మన ఎర్రచందనాన్ని
## దేశంలో ఎక్కడ దాచినా వదలొద్దు: పవన్ కల్యాణ్

- ఎర్రచందనం స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం మోపాలని అధికారులకు పవన్ ఆదేశం
- స్మగ్లర్లతో పాటు కింగ్ పిన్‌లపైనా కఠిన చర్యలు తీసుకోవాలని సూచన
- నిఘా కోసం డ్రోన్లు, ఆధునిక టెక్నాలజీ వినియోగించాలని దిశానిర్దేశం
- గత రెండేళ్లలో 1239 మంది అరెస్ట్, 12 మందిపై పీడీ చట్టం ప్రయోగం

రాష్ట్రంలో ఎర్రచందనం స్మగ్లింగ్‌ను సమూలంగా నిర్మూలించాలని, అక్రమ రవాణాపై 'జీరో టాలరెన్స్' విధానాన్ని అత్యంత కఠినంగా అమలు చేయాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రానికి చెందిన ఎర్రచందనాన్ని దేశంలో ఏ మూలన దాచిపెట్టినా వదలొద్దని, స్మగ్లర్లతో పాటు వారి

మిగతాది 2లో

# కంపెనీలు ఏపీని
## ఎంచుకోవడానికి కారణం ఇదే

● నారా లోకేశ్ అధ్యక్షతన మంత్రుల బృందం తొలి సమావేశం ● పరిశ్రమల రాకకు 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానమే కారణం అని లోకేశ్ వెల్లడి ● రాష్ట్రానికి రూ.29.30 లక్షల కోట్ల పెట్టుబడులతో 1037 పరిశ్రమలు ● దీని ద్వారా 24.66 లక్షల మందికి ఉపాధి అవకాశాలు



ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో భారీగా పెట్టుబడులు రానున్నాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు రూ.29.30 లక్షల కోట్ల పెట్టుబడులతో 1037 పరిశ్రమలు రాష్ట్రంలో ఏర్పాటయ్యేందుకు ముందుకు వచ్చాయని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. వీటి ద్వారా సుమారు 24.66 లక్షల మంది యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని అంచనా వేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనపై ఏర్పాటైన మంత్రుల బృందం (+శీవీ) తొలి సమావేశం ఉండవల్లిలో మంత్రి లోకేశ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. ప్రతి ప్రాజెక్టును

మిగతాది 2లో

## వైసీపీ నేత సీదిరి అప్పలరాజుకు 14 రోజుల రిమాండ్

- మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్
- కొడుకు చేసిన యాక్సిడెంట్ కేసులో అరెస్ట్
- సాక్ష్యాలు తారుమారు చేసి, బాధితులను ప్రలోభపెట్టారన్న ఆరోపణలు



# ప్రధాని మోదీ హామీ.. గంటల్లోనే కార్యాచరణ..
# పేపర్ లీకేజీలపై ఉక్కుపాదం

నరేంద్ర మోదీ ప్రకటించిన గంటల వ్యవధిలోనే ఈ ప్రక్రియను మొదలుపెట్టింది. నీట్ పేపర్ లీకేజీ కేసులో నిందితులను కొత్తగా తీసుకొచ్చిన ‘పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) యాక్ట్-2024’ కింద విచారించనున్నారు. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చట్టం కింద దోషులుగా తేలిన వారికి గరిష్ఠంగా 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధించే అవకాశం ఉంది. ఈ కేసుల విచారణ కోసం తొలి దశలో నాలుగు రాష్ట్రాల్లో ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. బాంబే, కలకత్తా, ఢిల్లీ, మధ్యప్రదేశ్ హైకోర్టుల పరిధిలో ఈ ప్రత్యేక కోర్టులు పనిచేయనున్నాయి. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న నాలుగు కేసులను ఈ ఫాస్ట్-ట్రాక్ కోర్టులకు బదిలీ చేయనున్నారు. నీట్ పేపర్ లీక్‌కు సంబంధించి ఈ కొత్త చట్టం కింద ఇప్పటికే నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. వీటిలో రెండు కేసులు బాంబే హైకోర్టు పరిధిలోకి వస్తాయి. ఈ కేసుల విచారణ కోసం ప్రత్యేక ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలను, హైకోర్టులను కేంద్రం అధికారికంగా కోరనుంది. రోజువారీ విచారణ జరిపి, కేసులను త్వరగా పరిష్కరించాలని ఈ అభ్యర్థనలో పేర్కొననుంది. నీట్‌తో పాటు యూపీఎస్సీ, ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, ఐబీపీఎస్ వంటి ఇతర పోటీ పరీక్షలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు సంబంధించిన పేపర్ లీకేజీలు కూడా ఈ కొత్త చట్టం పరిధిలోకి వస్తాయని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. అంతకుముందు ప్రధాని నరేంద్ర మోదీ ‘ఎక్స్’ వేదికగా స్పందిస్తూ.. యువత భవిష్యత్తు, సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. “యువత భవిష్యత్తును దెబ్బతీయాలని ప్రయత్నించే వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదు” అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. దోషులకు కఠిన శిక్షలు పడేలా ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

---

# పెట్రోల్‌లో 20 శాతానికి మించి ఇథనాల్..?

ముందు శాస్త్రీయ అధ్యయనాలు, సాంకేతిక పరిశీలనలు, అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపింది.




లోక్‌సభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు కేంద్ర పెట్రోలియం, సహజవాయు శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఆటోమొబైల్ తయారీ సంస్థలు, చమురు మార్కెటింగ్ కంపెనీలు, పరిశోధనా సంస్థలతో సంప్రదింపులు జరిపిన తర్వాతే తదుపరి నిర్ణయం ఉంటుందని పేర్కొన్నారు. 85 శాతం ఇథనాల్, 15 శాతం పెట్రోల్‌తో కూడిన ‘ఈ85’ ఇంధనాన్ని కేవలం ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాల
కోసం మాత్రమే ప్రవేశపెట్టామని, ఇది దేశవ్యాప్తంగా పెట్రోల్‌లో ఇథనాల్ శాతాన్ని పెంచినట్లు కాదని మంత్రి వివరణ ఇచ్చారు. భారత్‌లో ఇథనాల్ బ్లెండెడ్ పెట్రోల్ కార్యక్రమాన్ని
నీతి ఆయోగ్, ఏఆర్ఏఐ, సియామ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం, చమురు సంస్థలు తదితర సంస్థల సలహాలతో శాస్త్రీయంగా అమలు చేస్తున్నామని తెలిపారు.
దేశవ్యాప్తంగా 20 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు, 3 కోట్లకుపైగా పెట్రోల్ కార్లు ‘ఈ20’ ఇంధనాన్ని వినియోగిస్తున్నప్పటికీ, ఇథనాల్ కారణంగా ఇంజిన్ దెబ్బతిన్నట్లు లేదా అసాధారణ సమస్యలు తలెత్తినట్లు ఎలాంటి నిర్ధారిత ఆధారాలు లేవని కేంద్రం వెల్లడించింది. వాహన తయారీ సంస్థలు కూడా ఈ20 వాడుతున్న వాహనాలకు వారంటీ కొనసాగిస్తున్నాయని పేర్కొంది. ఈ20 ఇంధనం వల్ల కొంతమంది పాత వాహనాల్లో ఇంధన సామర్థ్యం 3 నుంచి 5 శాతం వరకు తగ్గే అవకాశం ఉన్నప్పటికీ, మెరుగైన దహన ప్రక్రియ, తక్కువ కాలుష్యం, మంచి యాక్సిలరేషన్ వంటి ప్రయోజనాలు ఉన్నాయని మంత్రి తెలిపారు.
ఇథనాల్ మిశ్రమ కార్యక్రమం వల్ల ఇప్పటివరకు రూ.1.97 లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్యం ఆదా కావడంతో పాటు 316 లక్షల మెట్రిక్ టన్నుల ముడి చమురు దిగుమతులు తగ్గాయని తెలిపారు. 952 లక్షల మెట్రిక్ టన్నుల కార్బన్ ఉద్గారాలు తగ్గడంతో పాటు రైతులకు రూ.1.66 లక్షల కోట్లకు పైగా ఆదాయం చేరిందని కేంద్రం వెల్లడించింది.

# ఐదు లక్షల పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు: సీఎం

సంకేతం అని నిలదీశారు. అసలు బీఆర్ఎస్, బీజేపీ మధ్య ఉన్న కుమ్మక్కేంటని అడిగారు. గురువారం హైదరాబాద్ లో ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఓటు చాలా ముఖ్యమనీ, సర్ ప్రకియ లో మిగిలిన 30 శాతం చాలా కీలకమని సీఎం చెప్పారు. ఆ ప్రక్రియలో బీఎల్‌వో పాత్ర మరింత కీలకమన్నారు. తన ఓటును కొడంగల్ కు బదిలీ చేసుకున్నట్టు వెల్లడించారు. సర్ ప్రక్రియతో గ్రామాల్లోని దళితులు, గిరిజనుల, మైనార్టీల ఓట్లు పోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. అదే జరిగితే పథకాలు, ఆధార్, గుర్తింపు, సంక్షేమం దూరమవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ ఓటు బ్యాంక్ ను దెబ్బతీయడమే లక్ష్యంగా సర్ ప్రక్రియ జరుగుతున్నదని ఆరోపించారు. బీజేపీ నాయకుల మధ్య అంతర్గత ఘర్షణలున్నాయనీ, ఒకరంటే ఒకరికి పడదని సీఎం తెలిపారు. బీఆర్ ఎస్ పేదలకిచ్చే ఇండ్లను దళారులకు అమ్ముకుందని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో ఇంటర్మీడియట్ పేపర్లు సరిగ్గా దిద్దక పోవడంతో 27 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారనీ, దానికి కారణమైన గ్లోబరీనా కేటీఆర్ బినామీ సంస్థ ఆరోపించారు. ప్రజలకు కేటీఆర్ క్షమాపణ చెప్పాలనీ, అమరవీరుల స్థూపం దగ్గర కేటిఆర్ ముక్కు నేలకు రాయాలని డిమాండ్ చేశారు. గ్లోబరీనా సంస్థ పైన కేటీఆర్ సీసీఎస్ లో ఫిర్యాదు చేయాలని సవాల్ విసిరారు. తాము విచారణ చేస్తే కక్ష సాధింపు అంటారన్నారు. గ్లోబరినాపై నివేదిక వచ్చాక ఏం చేయాలో అది చేస్తామన్నారు. పరువున్నవారు వేస్తే దాన్ని పరువు నష్టం దావా అంటారన్నారు. జన్వాడ ఫార్మ్ హౌస్ లో ఏ రాజుల భూములున్నాయో విచారణకు డిమాండ్ చేయాలని కేటీఆర్ కు సూచించారు. తాము తిరిగి తెరిచిన ధర్నా చౌక్ లోనే కేటీఆర్ ధర్నా చేస్తామని అంటున్నారని ఎద్దేవా చేశారు. చెరువులను పునరుద్ధరిస్తూ, .ప్రభుత్వ భూములను కాపాడుతూ హైడ్రా బ్రహ్మాండంగా పని చేస్తున్నదని కొనియాడారు. మాజీ సీఎం కేసీఆర్ కు తెలియకుండా కాళేశ్వరం లో వందల కోట్లు రూపాయలను తీసుకున్నాడనే కారణంతోనే హరీశ్‌రావును ఆ శాఖ నుంచి తప్పించారని ఆరోపించారు. అతి తెలివితో ఏది పడితే అది మాట్లాడితే కుదరదని హెచ్చరించారు. తనను ఎందుకు నీటిపారుదల శాఖ మంత్రి పదవి నుంచి తొలగించారో చెప్పాలని మాజీ మంత్రి హరీశ్ రావుకు సవాల్ విసిరారు. ఎన్డీఎస్ఏ చెప్పింది వినాలా వద్దా? వినియోగంలోకి తేవాలంటే పరీక్షలు చేయాలని చెప్పాక కూడా మేడిగడ్డ ఎక్కడ ఎత్తి పోయాలా? అని ప్రశ్నించారు. పంపులు, బిల్లులు, కమీషన్లు కథ అయిపోయిందనీ, బీఆర్ఎస్ నేతలు కన్నెపెల్లి పంపు హౌజ్ గురించి మాట్లాడుతున్నారనీ, మేడిగడ్డ గురించి ఎందుకు మాట్లాడడం లేదని నిలదీశారు. ‘మేడిగడ్డ గురించి మాట్లాడితే ప్రజలు చెప్పుతో కొడతారు. మేడిగడ్డ కట్టింది, కూల్చింది బీఆర్ఎస్ వాళ్ళే. బీఆర్ఎస్ నేతలు సీబీఐ ను మేనేజ్ చేసుకున్నాం. ఎదురుదాడి చేస్తే సరిపోద్ది అనుకుంటున్నారు. బీఆర్ఎస్ హయాంలో కాఫర్ డ్యాం ఎందుకు కట్టలేదు?’ అని సీఎం ప్రశ్నించారు. కన్నె పల్లి పంప్ హౌస్ హరీశ్ రావు సాగునీటి పారుదల శాఖ మంత్రి గా ఉన్నప్పుడు నిర్మాణమైందని గుర్తుచేశారు.అతి తెలివి తో మాట్లాడితే పిచ్చి లేసిందని హరీశ్ రావును మెంటల్ ఆస్పత్రిలో చేర్పిస్తారని హెచ్చరించారు. కాళేశ్వరం లో గేట్లు ఎత్తి వేయాలని నిపుణులు స్పష్టం చేశారనీ, ఎన్డీఎస్ ఏ
చైర్మెన్ స్వయంగా కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించారని తెలిపారు. ఈ విషయం గురించి హరీశ్ రావు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. దేవాదులలో అన్ని పంపులు పని చేస్తున్నాయనీ, మేడిగడ్డ దగ్గర కాఫర్ డ్యామ్ ఆకాశం నుంచి దిగి రాదనీ, మరో డ్యామ్ కట్టేందుకు ఐదు మీటర్ల నీళ్లు ఉండాలంటే మేడిగడ్డ గేట్లు దిగాల్సిందేననీ స్పష్టం చేశారు. ఒక్క రోజు మాత్రమే లక్ష క్యూ సెక్కుల నీళ్లు వచ్చాయనీ, నీళ్లు నిలపకపోతే బ్యారేజ్ లు ఎందుకు నిర్మించారని ప్రశ్నించారు. మేడిగడ్డ అంటే ప్రజలు తన్నుతారనే కన్నె పల్లి పంప్ హౌస్ గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం పైన ఎన్డీఎస్ఏ, పీసీ ఘోష్ నివేదిక స్పష్టం ఉందనీ, కాళేశ్వరం పైన సీబీఐ విచారణను కోరామని ఆయన గుర్తుచేశారు. బీఆర్ఎస్ అవయవదానంతో బీజేపీకి అధికారం పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అవయవదానం చేసి బీజేపీని గెలిపించిందనీ, అందులో బీఆర్ఎస్ కు అధికారం ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సిద్దిపేట ,గజ్వేల్, సిరిసిల్ల లో లోకసభ ఎన్నికల్లో బీజేపీకి ఎందుకు మెజారిటీ వచ్చింది? తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు రక్తం ధారపోశారే తప్ప కేసీఆర్, కేటిఆర్, హరీష్ రావు, సంతోశ్‌రావు చుక్క రక్తం ఇచ్చారా? అని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు కూడా పేదల రక్తం అమ్ముకుంటున్నారని విమర్శించారు. ఉద్యోగాల భర్తీ పైన అసెంబ్లీ లో కేటీఆర్ ప్రశ్నిస్తే, పేర్ల తో సహా నియామకాల లిస్ట్ ఇస్తానని సీఎం స్పష్థం చేశారు. ఉద్యోగాలపై
చర్చకు తాను సిద్ధమని స్పష్టం చేశారు. నోటిఫికేషన్ ఇవ్వడం, ప్రశ్నపత్రం అమ్ముకోవడం బీఆర్ఎస్ విధానమైతే నోటిఫికేషన్లు ఇచ్చి నియామక పత్రాలు ఇవ్వడం తమ విధానమని తెలిపారు. టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశామన్నారు. 55 రోజుల్లో 11 వేల టీచర్ ఉద్యోగాలను భర్తీ చేశామని వివరించారు. ఆహార కల్తీపై కఠినంగా ఉన్నామని తెలిపారు. ఐదు లక్షల పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను బ్రోకర్లు అమ్మకునే వ్యవస్థను బీఆర్ఎస్ నేతలు తెచ్చారని సీఎం ఆరోపించారు. తాము ఏం చేస్తున్నామో అదే చెబుతున్నామని తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు రెఫరెండమని కేటీఆర్ అన్న విషయాన్ని గుర్తుచేశారు. కేటీఆర్ దావత్ ఇస్తే తాను తీసుకోలేనేమోననీ, కేటీఆర్ వి అన్ని వేరే పార్టీలని సెటైర్ వేశారు. కేసీఆర్ కుటుంబ సభ్యులెవరూ రక్తదానం చేయలేదనీ, ఇతరులు ఇచ్చిన రక్తం ఎవరికి అమ్ముకున్నారో చెప్పాలన్నారు. తీసిన రక్తం గాంధీకి, ఉస్మానియాకు ఇస్తే బాగుండేదన్నారు. తెలంగాణ ఉద్యమంలో రెచ్చగొట్టి ప్రాణాలు తీసుకున్న వారే ఇప్పుడు రక్తం తీసుకుంటున్నారన్నారు. పెట్టుబడి పెట్టాడు కాబట్టే రోడ్డుకు ట్రంప్ పేరు పెట్టామన్నారు. నచ్చితే నజరానా నచ్చకపోతే జరిమానా తమ విధానం కాదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. చట్ట ప్రకారం చర్యలుంటాయని చెప్పారు. బీఆర్ఎస్ తప్పులపై విచారణ జరుగుతోందని చెప్పారు. తనకు నచ్చలేదని వెంటనే శిక్ష వేయాలా? అని ప్రశ్నించారు. చార్లెస్ శోభ రాజు, బిల్లా రంగాలు కూడా జైల్లో ఉన్నారనీ, జైలుకు వెళ్తే ముఖ్యమంత్రులు అవుతారా? అని అడిగారు.

# మన ఎర్రచందనాన్ని దేశంలో ఎక్కడ దాచినా వదలొద్దు: పవన్ కల్యాణ్

రాష్ట్రానికి చెందిన ఎర్రచందనాన్ని దేశంలో ఏ మూలన దాచిపెట్టినా వదలొద్దని, స్మగ్లర్లతో పాటు వారి వెనుకున్న కింగ్ పిన్‌లపైనా ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేశారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో అటవీ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి తీసుకుంటున్న చర్యలు, భవిష్యత్ కార్యాచరణపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, “ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే ప్రత్యేకమైన అటవీ సంపద ఎర్రచందనం. దీనిని కాపాడుకోవడం మనందరి బాధ్యత. ఎర్రచందనం స్మగ్లింగ్‌పై కూటమి ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తుంది. నిఘాను పటిష్ఠం చేసేందుకు డ్రోన్ పరిజ్ఞానం, అత్యాధునిక సాంకేతికతను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి. స్మగ్లింగ్ ముఠాల నెట్‌వర్క్‌ను మూలాలతో సహా పెకిలించాలి” అని అన్నారు. ఇతర రాష్ట్రాల పోలీసు, అటవీ శాఖ అధికారులతో తక్షణమే సమన్వయం పెంచుకోవాలని, దేశంలో ఎక్కడైనా అక్రమ నిల్వలు ఉంటే వాటిని స్వాధీనం చేసుకోవాలని సూచించారు. స్మగ్లింగ్ ముఠాలకు నిధులు సమకూర్చే ఫైనాన్షియర్లపైనా దృష్టి సారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గత రెండేళ్లలో ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడంలో సాధించిన ప్రగతిని అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. ఈ కాలంలో మొత్తం 506 కేసులు నమోదు చేసి 1,239 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. స్మగ్లింగ్‌కు వినియోగించిన 372 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. కీలకమైన 12 మంది ప్రధాన స్మగ్లర్లపై పీడీ చట్టం కింద చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో స్మగ్లర్లపై పీడీ చట్టం ప్రయోగించలేదని గుర్తుచేశారు. అంతేకాకుండా, గుజరాత్, ఢిల్లీ, కర్ణాటక, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించి,

## నీట్ నిరసనలు: అల్లర్ల నిందితుల పాస్‌పోర్ట్‌ల
## రద్దు యోచనలో ఢిల్లీ పోలీసులు

నీట్-యూజీ 2026 పరీక్షల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో విద్యార్థి సంఘాలు చేపట్టిన నిరసనల్లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో, దాడులకు పాల్పడినట్లు అభియోగాలు ఎదుర్కొంటున్న నిందితుల పాస్‌పోర్ట్‌లను రద్దు చేసే అంశాన్ని ఢిల్లీ పోలీసులు తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. ‘చలో సంసద్’ పిలుపులో భాగంగా నిరసనకారులు పార్లమెంటు వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన సమయంలో పోలీసులతో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ కేసుల్లో అరెస్టయిన కీలక నిందితులు విచారణ దశలో దేశం విడిచి పరారయ్యే అవకాశం ఉందని భావిస్తున్న అధికారులు, ముందస్తు జాగ్రత్త చర్యగా వారి పాస్‌పోర్ట్‌లను రద్దు చేయించాలని యోచిస్తున్నారు. సంబంధిత చట్ట నిబంధనల ప్రకారం కేంద్ర దర్యాప్తు సంస్థలతో సమన్వయం చేసుకుంటూ ఈ ప్రక్రియను చేపట్టాలని పోలీసులు భావిస్తున్నారు. గత కొన్ని వారాలుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని, పరీక్షల నిర్వహణ విధానంలో సమూల సంస్కరణలు తీసుకురావాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ నిరసనలు అధిక భాగం శాంతియుతంగానే సాగినప్పటికీ, కొన్ని చోట్ల రాళ్ల దాడి, పోలీసు వలయాలను ఛేదించే ప్రయత్నాలు జరగడంతో ఇరుపక్షాలకు చెందిన పలువురు గాయపడ్డారు. ఈ ఘటనలకు సంబంధించి పోలీసులు ఇప్పటికే పలు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. అయితే, పాస్‌పోర్ట్‌ల రద్దుపై ఇంకా ఎటువంటి తుది నిర్ణయం తీసుకోలేదని, ప్రస్తుతం ఈ అంశం సమీక్ష దశలోనే ఉందని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

## కంపెనీలు ఏపీని ఎంచుకోవడానికి కారణం ఇదే

నిరంతరం ట్రాక్ చేస్తూ, అవి త్వరితగతిన కార్యరూపం దాల్చేలా (గ్రౌండింగ్) చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. “పారిశ్రామిక సంస్థలు ఏపీని ఎంచుకోవడానికి ‘స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్’ విధానమే ప్రధాన కారణం. దీనిని ప్రతి అధికారి చిత్తశుద్ధితో అమలు చేయాలి” అని ఆయన స్పష్టం చేశారు. పరిశ్రమలకు భూ కేటాయింపులు, అనుమతులు, ప్రోత్సాహకాల విషయంలో వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రతినెలా నిర్వహించే సమీక్షా సమావేశంలో కచ్చితమైన పురోగతి కనిపించాలని దిశానిర్దేశం చేశారు.నవంబర్‌లో విశాఖపట్నంలో నిర్వహించనున్న పార్టనర్‌షిప్ సమ్మిట్ ద్వారా మరిన్ని పరిశ్రమలు రాష్ట్రానికి తరలివచ్చే అవకాశం ఉందని లోకేశ్ ఆశాభావం వ్యక్తం చేశారు. కొత్తగా వచ్చే పరిశ్రమలకు పునరుత్పాదక ఇంధన అవసరాలు ఎక్కువగా ఉంటాయని, అందువల్ల రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టులను వేగవంతం చేయాలని సూచించారు. ముఖ్యంగా, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఇ)పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఇవి ఎక్కువ ఉద్యోగావకాశాలు కల్పిస్తాయని మంత్రి అన్నారు. నిర్ణీత సమయంలో పరిశ్రమలను ఏర్పాటు చేసే ఎంఎస్ఎంఇలకు ప్రోత్సాహకాలు అందించేందుకు పూర్తిస్థాయి ఆటోమేటిక్ వ్యవస్థను తీసుకురావాలని ఆదేశించారు. గత రెండేళ్లలో 1,20,897 ఎంఎస్ఎంఇలకు ప్రోత్సాహకాలు అందించినట్లు అధికారులు ఈ సమావేశంలో వివరించారు. ఈ సమావేశంలో మంత్రులు పొంగూరి నారాయణ, కందుల దుర్గేశ్, గొట్టిపాటి రవికుమార్, కొండపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ నేత సీదిరి అప్పలరాజుకు 14 రోజుల రిమాండ్

వైసీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుకు పలాస కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. రోడ్డు ప్రమాదం కేసులో తన కుమారుడిని రక్షించేందుకు ప్రయత్నించారన్న తీవ్ర ఆరోపణలపై పోలీసులు ఆయన్ను బుధవారం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. గురువారం కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే, ఇటీవల అప్పలరాజు కుమారుడు ఆరవ్ నడిపిన బైక్ ఢీకొని దానయ్య అనే గొర్రెల కాపరి మృతి చెందాడు. ఈ కేసులో తన 18 ఏళ్ల కుమారుడిని కాపాడేందుకు అప్పలరాజు ప్రయత్నించారని పోలీసులు ఆరోపించారు. ప్రమాదానికి కారణమైన తన కుమారుడి స్థానంలో సిద్ధార్థ్ అనే మరో కుర్రాడిని నిందితుడిగా చిత్రీకరించేందుకు ఆయన యత్నించారని అభియోగాలు నమోదు చేశారు. అంతేకాకుండా, మృతుడి కుటుంబాన్ని డబ్బుతో ప్రలోభపెట్టాలని చూశారని, కేసుకు సంబంధించిన కీలక సాక్ష్యాధారాలను తారుమారు చేసి దర్యాప్తును తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించారని పోలీసులు తమ రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. బుధవారం అరెస్ట్ చేసిన తర్వాత, గురువారం పలాస జీజీహెచ్ లో అప్పలరాజుకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం పలాస కోర్టులో ప్రవేశపెట్టారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి, అప్పలరాజుకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కోర్టు ఆదేశాలతో అధికారులు ఆయన్ను అంపోలు జైలుకు తరలించారు. ఈ ఘటన రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

## డీఆర్‌డీఓ మరో ఘనత.. ‘కుశ’ క్షిపణి ప్రయోగం విజయవంతం

గగనతలంలో అత్యంత వేగంగా, ఎత్తులో ప్రయాణించే ఎలక్ట్రానిక్ లక్ష్యాన్ని అనుకరించి ఈ పరీక్ష నిర్వహించగా, ‘కుశ’ క్షిపణి దానిని విజయవంతంగా అడ్డగించిందని డీఆర్‌డీఓ ఒక ప్రకటనలో తెలిపింది. యుద్ధ విమానాలు, క్షిపణులు, మానవరహిత వైమానిక వాహనాలు (ఖూాఎ), శత్రువులకు చెందిన భారీ విమానాలను కూడా సుదూరంలోనే నాశనం చేయగల సత్తా ఈ క్షిపణి వ్యవస్థకు ఉంది. ‘ప్రాజెక్ట్ కుశ’లో భాగంగా భారత వాయుసేన, నౌకాదళం కోసం ఈ క్షిపణి వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న 80 కిలోమీటర్ల రేంజ్ ఎంఆర్-శామ్, 400 కిలోమీటర్ల రేంజ్ ఎస్-400 వ్యవస్థల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ‘కుశ’ భర్తీ చేయనుంది. ఇప్పటికే వాయు రక్షణ వ్యవస్థలో ఉన్న బరాక్-8, ఎస్-400, ఆకాశ్ క్షిపణులకు ఇది అదనపు బలంగా నిలవనుంది. ‘కుశ’ క్షిపణి విజయవంతం కావడం భారత రక్షణ పరిశోధన రంగంలో ఒక ముఖ్యమైన మైలురాయి అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఇలాంటి అత్యాధునిక క్షిపణి వ్యవస్థలను అభివృద్ధి చేయగల సామర్థ్యం కేవలం కొన్ని దేశాలకే ఉందని గుర్తుచేశారు. ఈ విజయంతో ఇలాంటి వ్యవస్థల కోసం విదేశాలపై ఆధారపడాల్సిన అవసరం తప్పుతుందని, ఇది దేశ వాయు రక్షణ సామర్థ్యంలో ఒక పెద్ద ముందడుగు అని ఆయన పేర్కొన్నారు. ఈ క్షిపణికి సంబంధించిన రాడార్లు, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ సహా అన్ని భాగాలను డీఆర్‌డీఓ, దేశీయ పరిశ్రమలు కలిసి అభివృద్ధి చేశాయి. రక్షణ శాఖ కార్యదర్శి, డీఆర్‌డీఓ ఛైర్మన్ రాజేష్ కుమార్ సింగ్ ఈ ప్రయోగాన్ని పర్యవేక్షించి, శాస్త్రవేత్తల బృందాన్ని అభినందించారు.

## శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ లేదు: సీఎం




గంజాయి మత్తులో జరిగే నేరాలను కట్టడి చేయాలని స్పష్టం చేశారు. గంజాయి, డ్రగ్స్‌ను చాలా వరకు నియంత్రించామని, ఇంకా పూర్తి స్థాయిలో అరికట్టాల్సి ఉందని తెలిపారు. వీటి వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీస్ వ్యవస్థను పూర్తిగా పునర్వ్యవస్థీకరించాల్సిన (రీ-స్ట్రక్చర్) అవసరం ఉందని ముఖ్యమంత్రి నొక్కిచెప్పారు. టెక్నాలజీ వినియోగం ద్వారా ‘ఇన్విజిబుల్ పోలీస్, విజిబుల్ పోలీసింగ్’ విధానానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ‘ఆపరేషన్ సిందూర్’ను తక్కువ మందితోనే టెక్నాలజీ సాయంతో విజయవంతం చేసినట్టు గుర్తుచేశారు. పోలీసులందరికీ డిజిటల్ అక్షరాస్యత తప్పనిసరి అని, పోలీసింగ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను (ఏఐ) విరివిగా వాడాలని సూచించారు. సోషల్ మీడియా, సైబర్ నేరాలు, మహిళలపై నేరాల కట్టడి వంటి అంశాల్లో పోలీసులకు ప్రత్యేక శిక్షణ, సర్టిఫికేషన్ కోర్సులు ప్రవేశపెట్టాలని ఆదేశించారు. రౌడీయిజం, ఫ్యాక్షనిజంను అదుపుచేశామని, శాంతి భద్రతల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. హెడ్ కానిస్టేబుల్, ఏఎస్ఐ స్థాయి సిబ్బంది అనుభవాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు.

## రాత్రి వేళల్లో కొనసాగుతున్న విజిబుల్ పోలీసింగ్.

- రహదారి ప్రమాదాల నివారణకు "స్టాప్, ఫేస్ వాష్ అండ్ గో" కార్యక్రమం





పల్లెవెలుగు కర్నూలు క్రైమ్. కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ వారి ఆదేశాల మేరకు కర్నూలు పోలీ సులు జిల్లాలో ప్రజల భద్రత, శాంతిభ ద్రతల పరిరక్షణ కోసం విజిబుల్ పోలీ సింగ్ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వ హిస్తున్నారు. ఈ కార్యక్ర మంలో భా గంగా నేరాల నియం త్రణకు అనుమా నాస్పద వ్యక్తు లు, వాహనాలను తనిఖీ చేస్తూ, ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొం దించే విధంగా చర్యలు చేపడు తున్నా రు. కర్నూలు,ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆదోని సబ్‌డివి జన్ల పరిధిలో పోలీసులు కట్టు దిట్టంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వ హించారు. బ్లూ కోల్ట్స్, క్యూఆర్టీ పోలీసు బృందాలు విస్తృత తనిఖీలు చేపట్టారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వ హించా రు .అదేవిధంగా రహదారి ప్రమాదాల నివారణకు "స్టాప్, ఫేస్ వాష్ అండ్ గో" కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వాహన దారులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రజలు పోలీసు లకు సహకరించాలని, ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా అనుమానాస్పద ఘటనలు గమ నించిన వెంటనే డయల్–112 లేదా డయల్–100కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూ చించారు.

## రండి... పాల్గొనండి...

### సీఎం పర్యటనను అఖండ విజయవంతం చేద్దాం!"

-మండల ప్రజలందరికీ ఈడిగ గోవింద్ గౌడ్ ఆహ్వానం



హోళగుంద పల్లె వెలుగు జులై :23 మండల ప్రజలకు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలకు సీనియర్ నాయకుడు ఈడిగ గోవింద్ గౌడ్ ముఖ్యమైన పిలుపునిచ్చారు. శనివారం ఆస్పరి మండల కేంద్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భారీ బహిరంగ సభ జరుగనున్న నేపథ్యంలో, ఈ కార్యక్రమాన్ని చారిత్రాత్మక విజయంగా నిలపాలని ఆయన కోరారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటన రాష్ట్ర అభివృద్ధికి, ఆలూరు నియోజకవర్గ ప్రగతికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు, మహిళలు, యువత, ప్రజలందరూ పెద్ద ఎత్తున హాజరై సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు."పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కష్టపడాలి. ముఖ్యమంత్రి సభకు ప్రతి గ్రామం నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చి ఐక్యతను చాటాలి. ఇది ఆలూరు నియోజకవర్గ గౌరవానికి సంబంధించిన కార్యక్రమం. అందరూ కుటుంబ సమేతంగా హాజరై ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికి సభను విజయవంతం చేయాలి" అని ఈడిగ గోవింద్ గౌడ్ పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడం ప్రతి తెలుగుదేశం పార్టీ కార్యకర్త బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

## యువతను అన్ని విధాల అండగా ఉంటా

డాక్టర్ మాచాని సోమనాథ్,





ఎమ్మిగనూరు పల్లె వెలుగు జులై 23 యువతను ప్రోత్సహించడంలో అన్ని విధాల అన్ని వేళలా అండగా ఉంటానని మాచాని సోమప్ప మెమోరియల్ ట్రస్ట్ సభ్యులు, రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి డా మాచాని సోమనాథ్ అన్నారు. భారత దేశ రక్షణలో భాగస్వాములు కావాలని సంకల్పంతో ఎమ్మిగనూరు పట్టణంలోని కోచ్ మల్లికార్జున ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ తీసుకుంటున్న ఎమ్మిగనూరు పరిసర ప్రాంత యువకులకు తోడ్పడటం మన అందరి బాధ్యత అని భారత సైన్యంలో చేరాలని లక్ష్యంగా పెట్టుకుని, అగ్నివీర్ -- అగ్నిపథ్ లలో చేరడం కోసం కఠినంగా శిక్షణ పొందుతున్న నిరుపేద యువకులు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారు. అలాంటి యువతకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో, వారికి అవసరమైన (సుమారు 10 వేల రూపాయల విలువగల) షూస్‌ను ఈరోజు మాచాని సోమప్ప మెమోరియల్ ట్రస్ట్ తరపున పంపిణీ చేయడం మా చిన్న ప్రయత్నం అని అన్నారు. దేశభక్తి, పట్టుదల, కష్టపడే మనసు ఉన్న ఈ యువతకు సరైన అవకాశాలు కల్పిస్తే, వారు రేపటి భారత దేశానికి బలమైన సైనికులుగా అవతరిస్తారు. "మన సైన్యంలో సేవ చేయడం ఒక ఉద్యోగం మాత్రమే కాదు అది ఒక గౌరవం, ఒక బాధ్యత, ఒక దేశ సేవ." అని డా మాచాని సోమనాథ్ కొనియాడారు. ఈ సేవా కార్యక్రమం ద్వారా యువతలో ఆత్మవిశ్వాసం పెంపొందించి, వారి లక్ష్య సాధనలో మేము ఒక చిన్న భాగస్వాములమవుతున్నాము అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ మల్లికార్జున, వివేకానంద స్వచ్ఛంద సేవా తిరుమల్ , శివన్న , సుధాకర్, వెంకటేష్, ధన, రహ్మాన్, రాజశేఖర్, అజయ్, చిన్న, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల డేటా డిజిటైజేషన్, మ్యాపింగ్ పనులు గడువులోగా పూర్తి చేయాలి.

**● ఎనోమలీస్ పరిష్కారంలో నాణ్యతతో కూడిన వేగం చూపాలి. ● మైక్రో ప్లానింగ్‌తో పెండింగ్ మ్యాపింగ్‌లను వేగవంతంగా పూర్తి చేయాలి. ● ఓటర్ల డేటా నిర్వహణలో ఖచ్చితత్వం, సమన్వయానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ● జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జిల్లాలో ఓటర్ల డేటా డిజిటైజేషన్, ఫ్యామిలీ మ్యాపింగ్, ఎనోమలీస్ పరిష్కార పనులను తక్షణమే నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఈఆర్ఓ, ఏఈఆర్ఓ లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుండి రెవెన్యూ అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఈఆర్వోలతో ప్రత్యేక ఓటర్ల సమగ్ర నమోదు పురోగతిపై టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మొత్తం 14,05,443 మంది ఓటర్లలో 12,30,715 మంది ఓటర్ల వివరాలు డిజిటైజ్ చేశారని , వీరిలో 26,414 ఓటర్ల మ్యాపింగ్ పూర్తికాలేదని, ప్రతి నియోజకవర్గం ఈఆర్ఓ, ఏఈఆర్ఓలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పూర్తి చేయాలని ఆదేశించారు. ఓపెన్‌లో ఉన్న రోల్‌బ్యాక్ కేసులను వెంటనే



పరిష్కరించడంతో పాటు పెండింగ్ మ్యాపింగ్‌లను పూర్తి చేసి డేటాను సకాలంలో అప్‌డేట్ చేయాలని సూచించారు. మ్యాపింగ్ ప్రక్రియలో కేవలం సంఖ్యల పెరుగుదలకే కాకుండా ఖచ్చితత్వానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. తండ్రి, తల్లి పేర్లలో స్వల్ప తేడాలు, జన్మతేదీల వ్యత్యాసాలు, వయస్సు సంబంధిత సాంకేతిక లోపాలు వంటి ఎనోమలీస్ ను క్షుణ్ణంగా పరిశీలించి సరైన ధృవీకరణ అనంతరమే క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధం లేని కుటుంబ సభ్యులతో మ్యాపింగ్ చేయకుండా నిబంధనల ప్రకారం మాత్రమే డేటాను నమోదు చేయాలని సూచించారు. జీరో ప్రగతి నమోదైన మండలాలపై ప్రత్యేక దృష్టి సారించి, మిగిలిన మ్యాపింగ్‌లను అత్యవసర ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఆర్డీవో, తహసీల్దార్ తమ పరిధిలోని సిబ్బందిని సమన్వయం చేసుకుని పనులను నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన చోట అదనపు సిబ్బందిని వినియోగించాలని సూచించారు. ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించి, మైక్రో ప్లానింగ్‌తో పనులు నిర్వహించాలని, నిర్ణీత గడువులోగా మ్యాపింగ్, డిజిటైజేషన్, ఎనోమలీస్ పరిష్కార ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## మెగా పీటీఎం-4.0 నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి.

ప్రతి తల్లిదండ్రి భాగస్వామ్యంతో విద్యార్థుల సమగ్రాభివృద్ధే మెగా పీటీఎం లక్ష్యం.
**జూలై 24న జిల్లాలోని 1,391 పాఠశాలలు, 80 కళాశాలలో మెగా పీటీఎం-4.0 నిర్వహణ.**

*జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.*



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఈ నెల 24వ తేదీన జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నిర్వహించనున్న మెగా పేరెంట్–టీచర్ మీటింగ్ (పి పి ఎం–4.0)ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి మెగా పీటీఎం ఏర్పాట్లపై జిల్లా స్థాయి అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మెగా పీటీఎం ద్వారా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య సమన్వయం ఏర్పడి విద్యార్థుల సమగ్రాభివృద్ధికి దోహదపడేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల విద్యా ప్రగతి, హాజరు, అభ్యాస సామర్థ్యం, ప్రవర్తన, ప్రాథమిక అభ్యాస నైపుణ్యాలు (ఎఫ్ ఎల్ ఎన్), ఆరోగ్య పరిస్థితి, పాఠశాల అభివృద్ధి తదితర అంశాలపై తల్లిదండ్రులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. జూలై 24వ తేదీ ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు జిల్లాలోని 1,391 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, 80 కళాశాలల్లో ఒకేసారి మెగా పీటీఎం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి ద్వారా తల్లిదండ్రులకు ఆహ్వాన పత్రికలు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు, దాతలను కూడా కార్యక్రమానికి ఆహ్వానించాలని ఆదేశించారు.

ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నిర్వహించే మెగా పీటీఎంకు తల్లిదండ్రులు, విద్యార్థులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

సమావేశంలో సంబంధిత ఉపాధ్యాయులు విద్యార్థుల చదువు, హాజరు, విద్యా ప్రగతి, అభ్యాస స్థాయి, ప్రవర్తన తదితర అంశాలను తల్లిదండ్రులకు వివరించి అవసరమైన సూచనలు అందించాలని తెలిపారు. అలాగే 'తల్లికి వందనం' పథకం కింద లబ్ధి పొందిన విద్యార్థుల వివరాలను తల్లిదండ్రులకు తెలియజేసి, పథకం లక్ష్యాలు, ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా, మండల స్థాయి అధికారులు ముందుగా రూపొందించిన మ్యాపింగ్ ప్రకారం తమకు కేటాయించిన పాఠశాలలకు హాజరై కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం రూపొందించిన మినిట్–టు–మినిట్ కార్యాచరణ ప్రణాళికను కచ్చితంగా అమలు చేయాలన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద ప్రభుత్వం నిర్దేశించిన మెనూనే అందించాలని స్పష్టం చేశారు. మెనూలో ఎలాంటి మార్పులు చేయరాదని కలెక్టర్ తెలిపారు.

ప్రతి తల్లిదండ్రి మొబైల్ ఫోన్‌లో ఎల్ ఈ ఏ పి యాప్ ను తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేయించి, లాగిన్ ప్రక్రియను పూర్తి చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసి, యాప్ ద్వారా విద్యార్థుల హాజరు, మార్కులు, ఆరోగ్య వివరాలు, మధ్యాహ్న భోజన సమాచారం వంటి సేవలను ఎలా వినియోగించుకోవాలో తల్లిదండ్రులకు ప్రత్యక్షంగా వివరించాలని సూచించారు. అలాగే డోనర్ యాప్ వినియోగంపై కూడా అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని తెలిపారు. ప్రతి విద్యార్థికి హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డుతో పాటు హెల్త్ కార్డును తల్లిదండ్రులకు అందజేయాలని ఆదేశించారు. ఇంకా ఆరోగ్య పరీక్షలు పూర్తి కాని విద్యార్థులకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులతో సమన్వయం చేసి పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య వివరాలను వెంటనే నమోదు చేయాలని సూచించారు. జిల్లాలోని ప్రతి పాఠశాలలో మెగా పీటీఎంను విజయవంతంగా నిర్వహించి తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు విద్యార్థుల అభ్యాస నాణ్యతను మెరుగుపరిచే దిశగా ప్రతి అధికారి, ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి స్పష్టం చేశారు.

## పసిమొగ్గలపై రాక్షసత్వం.

**☛పాఠశాలనా...చిత్రహింసల నిలయమా**
**☛సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు ఆగ్రహం.**



పల్లె వెలుగు నంద్యాల రూరల్. విద్యాబుద్ధులు నేర్పించి విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన పాఠశాల... రాక్షస ఆనందానికి, చిత్రహింసలకు నిలయంగా మారిందని సిపిఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బేతంచెర్ల పట్టణంలోని శ్రీ నారాయణ ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బాలుడిపై హెడ్మాస్టర్ సురేష్ బాబు, పాఠశాల సిబ్బంది అమానుషంగా దాడి చేసిన ఘటనను నిరసిస్తూ గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా రంగనాయుడు మాట్లాడుతూ... ఎలాంటి తప్పు చేయని పసివాడని కూడా చూడకుండా హెచ్‌ఎం సురేష్ బాబు సదరు విద్యార్థి పొత్తికడుపులో పిడిగుద్దులు గుద్ది, కాలికింద వేసి క్రూరంగా తొక్కి చేయి విరగొట్టడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. విద్యాసంస్థలు నడపాల్సిన ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి ఫీజుల రూపంలో వేలకు వేల రూపాయలు పీడిస్తూ వసూలు చేస్తున్నాయని మండిపడ్డారు. విద్యను అందించడానికి బదులుగా పసిపిల్లలను చిత్రహింసలకు గురిచేస్తూ రాక్షస ఆనందాన్ని పొందుతున్నారని ధ్వజమెత్తారు.

?శ్రీ నారాయణ పాఠశాల విద్యాబోధనను పూర్తిగా విడిచిపెట్టి పక్కా వ్యాపార కేంద్రంగా మారిందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, పెన్నులు, షూ, టై, బెల్టు, బ్లేజర్లు అమ్మడంతో పాటు నాణ్యత లేని ఆహార పదార్థాలను అధిక ధరలకు విక్రయిస్తూ తల్లిదండ్రుల నుంచి నిలువు దోపిడీకి పాల్పడుతున్నారని తీవ్రంగా విమర్శించారు. విద్యార్థిపై క్రూరంగా దాడి చేసి చేయి విరగొట్టిన హెచ్‌ఎం సురేష్ బాబుతో పాటు, దానికి సహకరించిన పాఠశాల సిబ్బందిపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని రంగనాయుడు డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ నిబంధనలను బొందపెట్టి అక్రమాలకు పాల్పడుతున్న శ్రీ నారాయణ పాఠశాల గుర్తింపును విద్యాశాఖ అధికారులు తక్షణమే రద్దు చేయాలన్నారు. బాధ్యులపై పూర్తిస్థాయిలో కఠిన చర్యలు తీసుకోని పక్షంలో జిల్లా కలెక్టర్, డీఈఓ ల దృష్టికి తీసుకెళ్లి ఆందోళనలను, పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని అధికారులను హెచ్చరించారు. విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి అక్రమాలకు, అరాచకాలకు పాల్పడుతున్న శ్రీ నారాయణ పాఠశాల యాజమాన్యంపై, హెచ్‌ఎంపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని రంగనాయుడు డిమాండ్ చేశారు.

# ఆహార భద్రత దిశగా బాధ్యతాయుత పాలన కోసం జూలై 25న నంద్యాలలో మహా సత్యాగ్రహ దీక్ష.

**ఆర్ ఏ ఆర్ ఎస్ రక్షణ మరియు నూనెపల్లె మార్కెట్ యార్డు ప్రభుత్వ భూముల పరిరక్షణే ప్రధాన లక్ష్యం.**

పల్లె వెలుగు నంద్యాల రూరల్. ఆహార భద్రత



దిశగా బాధ్యతయుత పాలన కోసం జూలై 25 వ తేదీన నంద్యాలలో మహాసత్య గ్రహ దీక్ష చేపట్టాలని నంద్యాలలోని అఖిలపక్ష ఐక్యవేదిక కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో అఖిలపక్ష ఐక్యవేదిక కన్వీనర్ ఏరువ రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల ఆహార భద్రత, రైతుల ప్రయోజనాలు, ప్రజా ఆస్తుల పరిరక్షణ కోసం జూలై 25న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నంద్యాల టెక్కె మార్కెట్ యార్డు వద్ద నిర్వహించనున్న "మహా సత్యాగ్రహ దీక్ష" ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ దీక్షకు మద్దతుగా గత పది రోజులుగా జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రజా చైతన్య కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఐక్యవేదిక నాయకులు సుమారు 10 వేల కుటుంబాలను ప్రత్యక్షంగా కలిసి నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ ఏ ఆర్ ఎస్) ప్రాధాన్యత, మార్కెట్ యార్డుల అవసరం, రైతులకు వాటి ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించి కరపత్రాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. నూనెపల్లె మార్కెట్ యార్డులో సుమారు రూ.60 కోట్ల విలువైన రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని రాజకీయ పార్టీ కార్యాలయం కోసం 33 సంవత్సరాల లీజుకు కేటాయించడం ప్రజా ఆస్తుల పరిరక్షణ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ప్రజా అవసరాల కోసం ఉద్దేశించిన భూములను రాజకీయ అవసరాలకు వినియోగించే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు.

అలాగే, 120 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ ఏ ఆర్ ఎస్) రాయలసీమ వ్యవసాయాభివృద్ధికి విశిష్ట సేవలు అందిస్తోందని పేర్కొన్నారు. అక్కడ కొనసాగుతున్న తాత్కాలిక కలెక్టరేట్‌ను వెంటనే ఇతర ప్రభుత్వ స్థలానికి తరలించాలని ప్రభుత్వాన్ని కోరారు. వ్యవసాయ పరిశోధన సంస్థల పరిరక్షణ దేశ ఆహార భద్రతకు అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు.

మహా సత్యాగ్రహ దీక్ష ప్రధాన డిమాండ్లు:

నూనెపల్లె మార్కెట్ యార్డులో రెండు ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయింపును వెంటనే రద్దు చేయాలని తెలిపారు. ఆర్ ఏ ఆర్ ఎస్ ప్రాంగణం నుంచి తాత్కాలిక కలెక్టరేట్‌ను ఇతర ప్రభుత్వ స్థలానికి తరలించాలని అన్నారు. మార్కెట్ యార్డులు, వ్యవసాయ పరిశోధన సంస్థలను బలోపేతం చేసి రైతు ప్రయోజనాలను పరిరక్షించాలని కోరారు. చివరగా, ప్రజా ఆస్తుల సంరక్షణ, రైతు ప్రయోజనాల రక్షణ, వ్యవసాయ పరిశోధన సంస్థల పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న మహా సత్యాగ్రహ దీక్షలో రైతులు, మేధావులు, యువత, కార్మిక సంఘాలు, ప్రజాసంఘాల ప్రతినిధులు, ప్రజలందరూ భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అఖిలపక్ష ఐక్యవేదిక కన్వీనర్ ఏరువ రామచంద్రారెడ్డి విజ్ఞప్తి చేశారు.

---

# సివిల్ సప్లై ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి--ఏఐటీయూసీ డిమాండ్.

**నంద్యాల జిల్లా సివిల్ సప్లే కార్యాలయం వద్ద నిరసన,సివిల్ సప్లే జిల్లా డి ఎం అశ్వత్ నారాయణ నాయక్ కు వినతి.**

**ఏపీ ఎస్సీ ఎస్సీఎల్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి- ఏ ఐ టి యు సి.**






పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఏపీ ఎస్ సి ఎస్ సి ఎల్ నంద్యాల జిల్లా పరిధిలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సివిల్ సప్లై డి ఎం అశ్వత్ నారాయణ నాయక్ గారికి వినతిపత్రం సమర్పించారు.5, 10, 15 సంవత్సరాలకు పైగా సేవలందిస్తున్న ఉద్యోగులకు అనుభవానికి తగిన ఇంక్రిమెంట్లు,వేతన పెంపు అమలు చేయాలని,ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రమోషన్లు ఇవ్వాలనీ, రెగ్యులర్ చేయాలనీ ఏఐటీయూసీ నంద్యాల పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు డి. శ్రీనివాసులు, ధనుంజయ్, డిప్యూటీ కార్యదర్శి భూమని శ్రీను లు డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుభవం ఉన్న ఉద్యోగులు, కొత్తగా చేరిన ఉద్యోగులతో సమాన వేతనం పొందడం అన్యాయమని పేర్కొంటూ, సీనియర్ ఉద్యోగులకు ప్రత్యేక వేతన ప్రయోజనాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వం, ఏపీ ఎస్ సి ఎస్ సి ఎల్ యాజమాన్యం వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఉద్యోగుల సంఘం నాయకులు, ఏఐటీయూసీ నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై ఉద్యోగ సంఘం నాయకులు నరసింహ, రాజేంద్ర ప్రసాద్, వెంకట లక్ష్మి, జయమ్మ, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

# రేపు విద్యార్థి సంఘాల రాష్ట్రవ్యాప్త బందుకు సిపిఐ సంపూర్ణ మద్దతు.

**సిపిఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు.**




పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నీట్ పేపర్ లీకేజ్ అక్రమాలపై న్యాయం చేయాలని కోరుతూ చలో పార్లమెంటుకు పిలుపునిచ్చిన నిరుద్యోగ యువతను మరియు విద్యార్థులపై పోలీసులు జరిపిన దారుణమైన లాటి చార్జిను భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ గా తీవ్రంగా ఖండిస్తున్నాం ఈ అణచివేత చర్యలకు నిరసనగా ఈ రేపు జరగబోయే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జరగబోయే రాష్ట్రవ్యాప్త బందుకు సిపిఐ నంద్యాల జిల్లా సమితి సంపూర్ణ మద్దతుగా ప్రకటిస్తు,

నీట్ అక్రమాలపై ప్రశ్నిస్తున్న యువతను భయభ్రాంతులకు గురి చేయడం తగదు విద్యార్థులపై లాఠీ చార్జీలు చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని నీట్ బాధ్యులపై చర్యలు తీసుకొని కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తులతో చెలగాటమాడుతున్నటువంటి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర రాజీనామా చేయాలా నీట్ ఎగ్జామ్ పేపర్ లీక్ వల్ల దాదాపు 20 మంది విద్యార్థులు మరణించడం జరిగింది . ఆ మరణించిన విద్యార్థులకు న్యాయం చేయాలని అదేవిధంగా గత 12 ఏళ్ల కేంద్ర ప్రభుత్వ పాలనలో దాదాపు 91 ఎగ్జామ్ పేపర్లు లీక్ కావడం అత్యంత దారుణమైన విషయమని చలో పార్లమెంటుకు పిలుపునిచ్చిన యువతను బిజెపి ఆర్ఎస్ఎస్ గూండాలు పోలీసుల ముసుగులో విద్యార్థులను నిరుద్యోగులను విచక్షణ రహితంగా కొట్టడం జరిగింది కావున రేపు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త బందును జయప్రదం చేయాలని డిమాండ్ చేశారు . సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ ఈ బందుకు ప్రైవేటు విద్యారంగ సంస్థ అధినేతలు విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల అధికారులు విద్యారంగ అధికారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సిపిఐ నాయకులు ప్రజాసంఘాల నాయకులు ఈ బందులో స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునివ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి శివయ్య, ఏఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు ఎర్రి స్వామి, ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు మల్లేష్, సిపిఐ పలుకురు శాఖ కార్యదర్శి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్ అర్జీపై సత్వర స్పందన: మార్కెట్ ఏడీకి పొదుపు సంఘాల మహిళల కృతజ్ఞతలు

**ప్రజా చైతన్య పార్టీ తెలుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్ వెల్లడి**



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కర్నూలు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో పొదుపు మహిళా సంఘాల సభ్యులు సమర్పించిన అర్జీపై అధికారులు సత్వరం స్పందించి న్యాయం చేయడం పట్ల మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రజా చైతన్య పార్టీ తెలుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్ మాట్లాడారు. గత కొన్నేళ్లుగా పొదుపు సంఘాల సమస్యల పరిష్కారం కోసం పలుమార్లు సంబంధిత అధికారులను కలిసి వినతిపత్రాలు ఇచ్చినా తగిన స్పందన రాలేదని మహిళలు తెలిపారని ఆయన పేర్కొన్నారు. దీంతో తమ సమస్యను పీజీఆర్ఎస్‌లో జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారని వివరించారు. జేసీ ఆదేశాల మేరకు కర్నూలు మార్కెట్ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) నారాయణమూర్తి సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్జీదారులకు తగిన న్యాయం చేశారని తెలిపారు. తమ సమస్య పరిష్కారమవడంతో పొదుపు మహిళా సంఘాల నాయకులు, సభ్యులు క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో ఏడీ నారాయణమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలతో కృతజ్ఞతలు తెలియజేశారు. మానవతా దృక్పథంతో స్పందించి సమస్యను పరిష్కరించిన అధికారులకు మహిళలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజల సమస్యల పట్ల అధికారులు ఇదే విధమైన సానుకూల వైఖరిని ప్రదర్శించాలని వారు కోరారు.

# సీఎం దృష్టికి మదాసి--మదారి కురువల సమస్య.. వైకుంఠం జ్యోతికి వినతిపత్రం సమర్పణ

హోళగుంద పల్లె వెలుగు జులై :23 మదాసి--మదారి కురువలకు ఎస్సీ కుల ధ్రువపత్రాల జారీ విషయంలో ఎదురవుతున్న సమస్యను ఈనెల 25న ఆస్పరిలో జరగనున్న సంజీవిని



కార్యక్రమానికి హాజరుకానున్న గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ ఆలూరు టీడీపీ ఇన్‌చార్జ్ వైకుంఠం జ్యోతికి మదాసి--మదారి కురువ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ వీర నాగప్ప, ఆలూరు సొసైటీ చైర్మన్ కురువ బేవిని ఈరన్న, ఆలూరు తాలూకా మదారి--మదాసి కురువ సంఘం కన్వీనర్ కౌడికే రాజు, గౌరవ అధ్యక్షుడు రంగన్న, మండల ఉపాధ్యక్షుడు బెలగంటి కురువ హనుమప్ప మాట్లాడుతూ, మదాసి--మదారి కురువలకు ఎస్సీ కుల ధ్రువపత్రాల జారీ విషయంలో చాలా కాలంగా అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించి, అర్హులైన వారికి ఎస్సీ కుల ధ్రువపత్రాలు జారీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన వైకుంఠం జ్యోతి, ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గాది, వెంకప్ప, మంగన్న, ధర్మన్నతో పాటు మదాసి--మదారి కురువ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# టీడీపీ నాయకుడు పెనుగొండ రామాంజనేయులు తండ్రి రాముడుకు -నివాళులర్పించిన వై.నాగేశ్వరరావు యాదవ్



పల్లె వెలుగు -ప్యాపిలి ప్యాపిలి మండలం బూర్గల గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు పెనుగొండ రామాంజనేయులు తండ్రి పెనుకొండ రాముడు అకాల మరణం చెందడం పట్ల టీడీపీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాముడు భౌతిక కాయానికి డీసీఎంఎస్ చైర్మన్ వై నాగేశ్వరరావు యాదవ్, టిడిపి మండల అధ్యక్షుడు సుదర్శన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ రాముడు మరణం వారి కుటుంబానికి, గ్రామానికి తీరని లోటని శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి,తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ కష్టసమయంలో వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని, ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ఆ భగవంతుడిని ప్రార్థించారు. తెలుగుదేశం పార్టీ వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటుందని,ఏ అవసరం వచ్చినా తోడుగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.

# మహానంది క్షేత్రంలో భక్తిశ్రద్ధలతో ఆలయ శుద్ధి





**మహానంది, పల్లె వెలుగు** మహానంది పుణ్యక్షేత్రంలో ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని వార్షిక ఆలయ శుద్ధి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. గురువారం ఆలయ ఈవో ఎన్. శ్రీనివాసరెడ్డి ద్వారాలు, స్తంభాలను సుగంధ ద్రవ్యాలతో కడిగి శుద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా వేద పండితులు రవిశంకర అవధాని గణపతి ప్రార్థన, ద్రవ్యపూజలు చేసి అనంతరం శాస్త్రోక్తంగా ఆలయములలోని ప్రతిభాగాన్ని శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు,ఏజెన్సీ ఉద్యోగులు,సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# రైతుల ప్రయోజనాలే లక్ష్యం.. అగ్రి డీలర్లకు వ్యవసాయ శాఖ స్పష్టమైన ఆదేశాలు

హోళగుంద పల్లె వెలుగు జులై :23 హోళగుంద మండలంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల వ్యాపారులతో మండల వ్యవసాయ అధికారి ఆనంద్ లోకదళ్ అధ్యక్షతన గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని డీలర్లకు పలు కీలక సూచనలు చేశారు. రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా, డీఏపీ ఎరువులు తగినంత నిల్వ ఉంచాలని, యూరియాను ప్రభుత్వం నిర్ణయించిన ఎం ఆర్ పి



కంటే అధిక ధరకు విక్రయించరాదని స్పష్టం చేశారు. యూరియా, డీఏపీ ఎరువుల విక్రయాలు తప్పనిసరిగా ఏపీఏఐఎంఎస్ 2.0 యాప్ ద్వారానే నిర్వహించాలని సూచించారు. ఈ ప్రక్రియలో రైతుల నుండి ఆధార్ కార్డు లేదా ఆధార్ నంబర్ మాత్రమే తీసుకోవాలని, పొలం పాస్‌బుక్‌లు అవసరం లేదని తెలిపారు. అలాగే రైతులకు విక్రయించిన ప్రతి యూరియా, డీఏపీ బ్యాగ్ వివరాలను అదే రోజు ఏపీఏఐఎంఎస్ 2.0 మరియు డిపిటి యాప్‌లలో నమోదు చేయడం తప్పనిసరి అని పేర్కొన్నారు. ప్రతి విక్రయానికి రైతుకు బిల్లు ఇవ్వాలని, ఆ బిల్లుపై రైతు సంతకం తీసుకోవాలని సూచించారు. దుకాణాల్లో ధరల పట్టికలు, స్టాక్ వివరాలు, రికార్డులను ప్రతిరోజూ నవీకరించాలని, ప్రతి నెల 5వ తేదీలోపు సేల్స్ రిపోర్టులను వ్యవసాయ అధికారి కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు, పురుగు మందులు, బయో ఉత్పత్తులు విక్రయిస్తే సంబంధిత డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి ఆనంద్ లోకదళ్ హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులు అందించడం ప్రతి డీలర్ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

## విజయవంతంగా కొనసాగుతున్న మధుమణి ఉచిత శస్త్ర చికిత్సల వైద్య శిబిరం.

**● ఇప్పటికీ 50 శస్త్ర చికిత్సలు పూర్తి. ● ఆదివారం లోపు మిగిలిన 50 శస్త్ర చికిత్సలు నిర్వహిస్తాం: డాక్టర్ మణిదీప్. ● మొదటి నాలుగు రోజులలో ఓపిడిలో 600 మందికి ఉచిత వైద్య సేవలు.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల పట్టణంలోని స్థానిక మధుమణి నర్సింగ్



హోమ్ లో గత సోమవారం ప్రారంభించబడిన 36 వ ఉచిత చెవి, ముక్కు, గొంతు శస్త్ర చికిత్సల శిబిరం విజయవంతంగా కొనసాగుతున్నది. సోమవారం రోగులను ఎంపిక చేసుకుని అవసరమైన పరీక్షలు నిర్వహించి, మంగళవారం నుంచి రోజుకు 15 ఆపరేషన్ల చొప్పున ఉదయం 6:00 నుండి సాయంత్రం 6 గంటల వరకు చేస్తున్నారు. గురువారం సాయంత్రానికి 50 ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేశారు. ఈ వారం రోజులలో మధుమణి ఆసుపత్రి నిర్వాహకులు ప్రముఖ చెవి ముక్కు గొంతు శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ మధుసూధన రావు,డాక్టర్ మణిదీప్,డాక్టర్ రోహిత్ లతోపాటు దేశంలో వివిధ నగరాలకు చెందిన ప్రఖ్యాత చెవి ముక్కు గొంతు శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ రామకృష్ణ,డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, డాక్టర్ మంజునాథ్,డాక్టర్ ఆర్షద్ హుస్సేన్, డాక్టర్ ఆదిత్య మూర్తి,డాక్టర్ శ్రీపతి నాయుడు, డాక్టర్ తేజ, డాక్టర్ అహిలా స్వామి, డాక్టర్ జయప్రకాశ్ రెడ్డి,తదితరులు ఈ నెల 23 వ తేదీ వరకు మొత్తం 100 శస్త్ర చికిత్సలు ఉచితంగా ఈ శిబిరంలో చేయడం జరుగుతుంది. ఈ శస్త్ర చికిత్సలకు అవసరమైన అనస్థీషియాను ప్రముఖ మత్తుమందు వైద్యులు డాక్టర్. జి.రవి కృష్ణ, డాక్టర్.డి.మాధవి, డాక్టర్ వంశీ అందజేస్తున్నారు. ప్రతిరోజు ఓపిడీలో 200 మంది రోగుల్ని పరీక్షించి అవసరమైన మందుల్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

## నారపరెడ్డి కుంటలో సీడ్ బాల్స్ వెదజల్లిన అటవీ శాఖ



బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూలై 23 : బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న నారాయణపురం గ్రామానికి సమీపంలో ఉన్న నారపరెడ్డి కుంటలో గురువారం అటవీశాఖ సిబ్బంది40 వేల సీడ్ బాల్సును వెదజల్లారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తూ ఉండటంతో సీడ్ బాల్స్ ను వెదజల్లడం ద్వారా కొత్త మొక్కలు పెరిగి అడవుల సాంద్రత పెరిగే అవకాశం ఉంది. బంకమట్టి కంపోస్టు ఆవు పేడ కొబ్బరి పీచు మిశ్రమంతో తయారుచేసిన సీడ్ బాల్స్ లలో రాగి, కానుగ,రావి, నల్లమొద్ది, జువ్వి,మేడి జాతులకు చెందిన విత్తనాలను ఉపయోగించారు. నంద్యాల ప్రాజెక్టు టైగర్ డిప్యూటీ డైరెక్టర్, బండి ఆత్మకూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఆదేశాల మేరకు నారపురెడ్డి కుంట సెక్షన్ పరిధిలోని సౌత్ బీటు నార్త్ బీటు ప్రాంతాలలో అడవి సాంద్రత తక్కువ ఉన్న ప్రాంతాలను ఎంపిక చేసి సీడ్ బాల్స్ ను వెదజల్లారు. ఈ కార్యక్రమంలో పారిశుర సెక్షన్ ఆఫీసర్ కాశీం నాయక్, బీట్ ఆఫీసర్ రాజేష్, ప్రొటెక్షన్ వాచర్లు దినేష్,కిరణ్,బయన్న, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి వెన్నముక..డోన్ ఎమ్మెల్యే కోట్ల.









పల్లె వెలుగు -డోన్ కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి వెన్నముక అని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం డోన్ పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో “2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి -- సంక్షేమం” కార్యక్రమాన్ని ప్రజాక్షేత్రంలోకి బలంగా తీసుకెళ్లే లక్ష్యంతోఎమ్మెల్యే అధ్యక్షతన ప్రత్యేక అవగాహన, శిక్షణ సమావేశం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సమావేశానికి క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లతో పాటు పట్టణ, మండల అధ్యక్షులు నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సుపరిపాలనలో గడచిన రెండేళ్ల కాలంలో అమలు చేసిన ప్రగతిదాయక పథకాలు, సంక్షేమ ఫలాలు ప్రతి పేదవాడి గడపకూ చేరాల్సిన అవసరం ఉందన్నారు.

?2 ఏళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం కార్యాచరణ ద్వారా

?గ్రామ, వార్డు, బూత్ స్థాయిలో ఇంటింటి ప్రచారాన్ని తీవ్రతరం చేయాలి.

?ప్రభుత్వం సాధించిన విజయాలను, ప్రజలకు అందించిన సంక్షేమ సేవలను ప్రతీ కుటుంబానికి స్పష్టంగా వివరించాలి.

?క్షేత్రస్థాయిలో ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ, ప్రజాభిమానాన్ని మరింత బలపరచుకోవాలి.

?”తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే వెన్నెముక. మీ అంకితభావం, నిరంతర శ్రమే పార్టీకి అసలైన బలం. క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లు స్వీయ బాధ్యతతో ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలన్నారు.

?కార్యాచరణ ప్రచార వ్యూహంపై దిశా నిర్దేశం

?సమావేశంలో భాగంగా నాయకులకు బాధ్యులకు భవిష్యత్ కార్యాచరణపై సమగ్ర అవగాహన కల్పించారు.ప్రతి బూత్ పరిధిలో పక్కా ప్రణాళికతో పర్యటించి కరపత్రాలు, ప్రచార సామగ్రితో ప్రజల్లో అవగాహన కల్పించడం.


క్లస్టర్, యూనిట్ స్థాయి ప్రతినిధులు నిరంతరం సమాచారాన్ని మార్పిడి చేసుకుంటూ సమన్వయంతో పనిచేయడం. ప్రభుత్వ సంక్షేమాన్ని పొందిన లబ్ధిదారులతో ప్రత్యేకంగా మాట్లాడి వారి అనుభవాలను పంచుకోవా లన్నారు.

?ఈ సమావేశంలో వలసల రామకృష్,సలింద్రశ్రీనివాసులు,హరికిషన్, ఫణి రాజ్,మాజీ ఎంపీపీ శ్రీనివాసులు, కేశవయ్య గౌడ్,సుదర్శన్, కొంగనపల్లె మధు, శేస్పని గౌడ్, రాఘవేంద్ర గౌడ్,ఆర్ఈ నాగరాజు, ప్రసాద్ రెడ్డి డోన్ నియోజకవర్గ ప్రజాప్రతినిదులు, క్లస్టర్-యూనిట్-బూత్ ఇన్‌చార్జ్‌లు,పట్టణ మండల పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆపన్న హస్తం అందించిన ఎర్రకోట రాజీవ్ రెడ్డి,,

ఎమ్మిగనూరు పల్లె వెలుగు జులై 23 వైఎస్ఆర్ చెందిన తంబాకు వీరేష్ స్వగృహానికి వెళ్లిన ఎర్రకోట రాజీవ్ రెడ్డి , ఇటీవల జరిగిన బస్సు ప్రమాదంలో తన చేయి కోల్పోయి న వీరేష్ ని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. హైదరాబాద్ నుండి కర్నూలుకు వస్తున్న సమయంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తంబాకు వీరేష్ కుడి చేయి తీవ్రంగా దెబ్బతినడంతో వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించి మోచేయి వరకు చేయిని తొలగించాల్సి వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న వెంటనే రాజీవ్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు.





కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి ని ఎమ్మిగనూరు పట్టణం 25వ వార్డు ఇన్‌చార్జ్ సలీం , వారి తమ్ముడు గౌస్ శాలువా కప్పి, పూలమాలతో ఘనంగా సన్మానించి తమ వార్డుకు ఆహ్వానించారు. 25వ వార్డుకు

ఈ సందర్భంగా రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ, “ధైర్యం కోల్పోవద్దు.మీ కుటుంబానికి నేను ఎల్లప్పుడూ అండగా ఉంటాను. మీ వైద్యం కోసం ఎంత ఖర్చైనా వెనుకాడను అని,కృత్రిమ చేయి అమరిక కోసం నిపుణులైన వైద్యులను సంప్రదించి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తాను అని,మీరు తిరిగి సాధారణ జీవితం గడిపేలా నా వంతు సహాయ సహకారాలు అందిస్తాను” అని భరోసా కల్పించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి తన మానవీయ దృక్పథాన్ని చాటుకున్నారు.

ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మాట్లాడుతూ, రాజకీయ నాయకుడిగా మాత్రమే కాకుండా ప్రతి కుటుంబ సభ్యుడిలా కష్టసమయంలో అండగా నిలిచి బాధిత కుటుంబానికి భరోసా కల్పించిన రాజీవ్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత విభాగ ప్రధాన కార్యదర్శి మాచని వెంకటేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుట్టా రంగయ్య, మాజీ వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ రియాజ్ అహ్మద్, మాజీ స్టోర్స్ డైరెక్టర్ షబ్బీర్ అహ్మద్, పట్టణ వైఎస్ఆర్సీపీ సీనియర్ నాయకులు కే.ఆర్. నటరాజ్ రెడ్డి, నియోజకవర్గ ప్రచార విభాగ అధ్యక్షుడు చాంద్ బాషా, నియోజకవర్గ వాలంటీర్స్ విభాగ అధ్యక్షుడు ఎస్.కే. బాబులాల్, పల్లె రంగారెడ్డి, చేనేత మల్లి, బంగి శ్రీరామ్, ఐటీ వింగ్ అధ్యక్షులు మాచని సోమేశ్, ప్రదీప్ రెడ్డి, ఏనుగుబాల కరుణాకర్ రెడ్డి, పంపయ్య, మాచని రఘు, సోమేశ్, దరాల శ్రీను, డిష్ కేశవ రెడ్డి, ఖాజా, చిన్న మరివీడు కృష్ణ,గిడ్డయ్యా, మధు, కరీం శివ, శ్రీను, వీరేష్, మోహన్ రెడ్డి, దానం, వేణు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్-నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు వరి, మొక్కజొన్న పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు వేయాలి.

**● ఈ-క్రాప్ నమోదును వేగవంతం చేయాలి. ● జూలై 31లోగా అర్హులైన ప్రతి రైతు పంట బీమాలో నమోదు కావాలి. ● కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డుల జారీని వేగవంతం చేయాలి. ● పీఎండీఎస్ విధానాలతో వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోవాలి. ● జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా.**




పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జిల్లాలో సంభవించే ఎల్-నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి, మొక్కజొన్న పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు వేసేలా రైతులకు ముందస్తు అవగాహన కల్పించాలని పాటు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఎల్-నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై వ్యవసాయ శాఖ అధికారులతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు సాగు ప్రణాళికలు రూపొందించుకునేలా వ్యవసాయ శాఖ అధికారులు గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు తక్కువ నీటి అవసరమున్న ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలన్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు వరి, మొక్కజొన్న వంటి అధిక నీటి అవసరమున్న పంటల సాగుకు దూరంగా ఉండాలని సూచించారు. వాటికి బదులుగా మినుము, కంది, జొన్న, సజ్జ, కొర్ర, ఆముదం వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు విజ్ఞప్తి చేయాలని సూచించారు.

జిల్లాలో సుమారు 1.80 లక్షల ఎకరాల్లో సాగు చేసిన పంటల వివరాలను ఎలాంటి ఆలస్యం లేకుండా ఈ-క్రాప్ పోర్టల్‌లో నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే పంట బీమా నమోదుపై ప్రత్యేక దృష్టి సారించి, జూలై 31వ తేదీలోగా అర్హులైన ప్రతి రైతు తప్పనిసరిగా పంట బీమాలో నమోదు చేసుకునేలా గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

జిల్లాలో కౌలు రైతులు అధిక సంఖ్యలో ఉన్నందున, అర్హులైన ప్రతి కౌలు రైతుకు సీసీఆర్‌సీ (సి సి ఆర్ సి) కార్డులు సకాలంలో జారీ అయ్యేలా చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ (పి ఎం డి ఎస్) విధానాన్ని విస్తృతంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ విధానం ద్వారా నేలలో జీవపదార్థం (బయోమాస్) పెరగడంతో పాటు తేమ ఎక్కువకాలం నిల్వ ఉండి, తక్కువ వర్షపాతం ఉన్నా పంటల ఎదుగుదలకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని తెలిపారు.

ఎల్-నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని సేంద్రీయ వ్యవసాయం, ప్రత్యామ్నాయ పంటలు, తక్కువ నీటితో సాగయ్యే పంటలపై రైతులకు సాంకేతిక మార్గదర్శకత్వం అందించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. చిన్నపాటి వర్షాలతోనే మెరుగైన మొలకలు వచ్చేలా విత్తనాల పెల్లెటింగ్ విధానాన్ని ప్రోత్సహించాలని, అలాగే స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక పంటల మిశ్రమ విత్తనాల వినియోగంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

వ్యవసాయానికి సంబంధించిన అన్ని సేవలు రైతులకు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని, విత్తనాలు, ఎరువులు, పంట బీమా, ఈ-క్రాప్ నమోదు తదితర సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని స్పష్టం చేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనా రైతు నష్టపోకుండా వ్యవసాయ శాఖ అన్ని స్థాయిల్లో అండగా నిలవాలని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు సకాలంలో సాంకేతిక సలహాలు, ప్రత్యామ్నాయ సాగు సూచనలు, విత్తనాలు, పంట బీమా, ఈ-క్రాప్ నమోదు తదితర సేవలను సమర్థవంతంగా అందించి వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# నీట్ పేపర్ లీకేజ్ కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలి,

**సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్షపై ప్రధాని నరేంద్ర మోడీ స్పందించాలి**

**☛ఢిల్లీలో విద్యార్థులపై లాఠీచార్జిని ఖండిస్తూ సోమప్ప సర్కిల్ లో రాస్తారోకో**




ఎమ్మిగనూరు పల్లె వెలుగు జూలై 23 దేశవ్యాప్తంగా 23 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన చీజుజు పరీక్ష పేపర్ లీకేజ్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే మంత్రి పదవి నుంచి తొలగించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప కేంద్ర ప్రభుత్వని డిమాండ్ చేశారు.
అనంతరం సిపిఐ ఆధ్వర్యంలో
గురువారం రోజున సోమప్ప సర్కిల్లో రాస్తారోకో కార్యక్రమం చేపట్టడం జరిగింది.
ఈ కార్యక్రమానికి సిపిఐ పట్టణ కార్యదర్శి జి.రంగన్న అధ్యక్షత వహించారు.
ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ
నీట్ పరీక్ష నిర్వహణకు 1.32 లక్షల కోట్లు ఖర్చు చేయడం,23 లక్షల మంది విద్యార్థుల కోసం కేంద్ర విద్య బడ్జెట్లో 1.40 లక్షల కోట్లు మాత్రమే ఉండడం దేశంలో కోచింగ్ కార్పొరేట్ వ్యవస్థ దోపిడీకి నిదర్శనమని వారు అన్నారు. నేటి పరీక్ష పేపర్ లీకేజ్ వల్ల 20 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడం జరిగిందని, అందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని,లడఖ్ ప్రజల హక్కులు, వ్యావరణ పరిరక్షణ, రాజ్యాంగ హామీల అమలు కోసం సామాజిక ఉద్యమకారుడు, శాస్త్రవేత్త సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరాహార దీక్షలు 20 రోజులు అయినప్పటికీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పందించలేని పక్షంలో కాక్రోచ్ జనతా పార్టీ వేలాది మంది దేశ యువత చలో పార్లమెంట్ మార్చ్ పిలుపునివ్వడంతో వేలాదిమంది విద్యార్థులుపాల్గొన్న సందర్భంగా విద్యార్థుల ఉద్యమాన్ని అంచు వేయడానికి మోడీ సర్కార్ పోలీసుల ద్వారా విద్యార్థులపై భాష్పవాయు, నీటి ఫిరంగులతో, లాఠీలతో దాడి చేసి గాయపరచడం చాలా దారుణమని వారు తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ఉందని హరించేలా మోడీ సర్కార్ అధికార మదంతో అంచి వేస్తుందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడడం, పరీక్షల పారదర్శకతను నిర్ధారించడం, ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులపై పోలీస్ దాడి పై సిజెఐ వాక్యాలు బాధాకరం
సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ మిశ్రా విద్యార్థులపై ఢిల్లీ పోలీసుల దాడిని విచారించేందుకు నిరాకరించారు అంతేకాకుండా అంత తీరిక లేదని సమయం వృధా అంటూ వ్యాకరించడం చాలా బాధాకరమని వారు తెలిపారు.విద్యార్థులపై ఈనెల 20న పోలీసుల ఇన్వాత్మకంగా వివరించిన తీరును తనకు తానుగా పరిజ్ఞానంలోకి తీసుకోవడానికి సుప్రీంకోర్టు తిరస్కరించింది. గతంలో సీజే దేశంలో ఉన్న యువతను బొద్దింకలంటూ చేసిన వాక్యాల నేపథ్యంలోనే కాక్రోచ్ జనతా పార్టీ ఆవిర్భవించడం జరిగిందని వారు గుర్తు చేశారు. నీట్ పేపర్ లీకేజ్ పైన, సోనమ్ వాంగ్ చుక్ నిరాహారదీక్ష పై, విద్యార్థుల లాఠీ చార్జీలపై ప్రధానమంత్రి మోడీ నోరు విప్పాలని వారు డిమాండ్ చేశారు. తక్షణమే మోడీ స్పందించి లీకేజ్ కు బాధ్యులైన కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను తక్షణమే క్యాబినెట్ నుండి తొలగించాలని లేనిపక్షంలో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కొనసాగుతాయని వారు హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు సోమేశ్వర్ రెడ్డి, మదిలేటి నాయుడు, రాజీవ్, బజారి, వీరేష్,విజయేంద్ర,మల్లికార్జున గౌడ్, నరసింహులు, రఫీక్, గోపాల్,నరసప్ప, ప్రభువు, వెంకటేష్, శంకర్, వీరేంద్ర, సుంకన్న, అబ్దుల్లా, హనుమంతు,యూనిస్, తదితరులు పాల్గొన్నారు. నీట్ పేపర్ లీకేజ్ ఘటనపై రేపు విద్యార్థి యువజన సంఘాలు విద్యా సంస్థల బంద్ కు సిపిఐ సంపూర్ణ మద్దతిస్తున్నామని సిపిఐ పట్టణ కార్యదర్శి జి. రంగన్న ప్రకటనలో తెలిపారు.

# కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

**☛కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో రైతు ధర్నా**




పల్లె వెలుగు కర్నూలు బ్యూరో వర్షాభావ పరిస్థితుల కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతన్నలను ఆదుకోవాలని, కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రైతుకూలీ సంఘం (ఏ×ఖమీా) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించారు.
ఈ ఆందోళనకు ఏ×ఖమీా జిల్లా ప్రధాన కార్యదర్శి బి. వెంకటస్వామి నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా వర్షాలు కురవక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూముల్లో వేసిన విత్తనాలు సరిగ్గా మొలకెత్తక పెట్టుబడి నష్టం చవిచూడాల్సి వస్తోందని తెలిపారు. వెంటనే స్పందించి కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి, నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే నేరుగా ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించి రైతులందరికీ ఉచితంగా పంటల బీమా వర్తింపజేయాలని కోరారు. పత్తి పంట ఇన్సూరెన్స్ విషయంలో ఉన్న నిబంధనల వల్ల చాలా మంది రైతులు లబ్ధి పొందలేకపోతున్నారని గుర్తుచేశారు. అలాగే రైతులకు ఉచితంగా ఎరువులు అందించాలని, ప్రైవేట్ దళారులు రైతులను దోచుకోకుండా చర్యలు తీసుకోవాలని, మార్కెట్‌లో నకిలీ విత్తనాలు, ఎరువుల అమ్మకాలను పూర్తిగా అరికట్టాలని డిమాండ్ చేశారు.
రైతు సాగునీటి అవసరాల కోసం పెండింగ్‌లో ఉన్న గుండ్రేవుల, ఆర్డీఎస్ కుడి కాలువ, వేదవతి, గురురాఘవేంద్ర ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు. లేనిపక్షంలో రైతులను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు జగన్, నారాయణ, ఈరన్న, చంద్రశేఖర్, సుధాకర్; ఐఎఫ్‌టీయూ నాయకులు సురేష్ నాయక్, మనోహర్, రవి, మల్లికార్జున; ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు మౌలాభి, సుజాతమ్మ, ఎల్లమ్మతో పాటు వివిధ గ్రామాల నుంచి వచ్చిన పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను కలిసి వినతి పత్రం అందజేసిన

**ఆంధ్ర విద్యార్థి సంఘం**



ఆళ్లగడ్డ పల్లె వెలుగు ప్రతినిధి జులై 23 రాష్ట్రంలో ఉండే విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ ఆంధ్ర విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గురువారం నాడు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను కలిసి వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. అనంతరం ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్కు కార్తీక్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉండే విద్యార్థుల సమస్యలను ఆళ్లగడ్డ నియోజకవర్గం ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని వారి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఆంధ్ర విద్యార్థి సంఘం డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశామన్నారు.
జీవో నెంబర్ 77 రద్దుచేసి,పీజీ విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ ఇవ్వాలని
రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని నియోజకవర్గాలలో రూసా నిధులతో మోడల్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేయాలని
కార్పొరేటు, ప్రైవేటు పాఠశాలలు మరియు కళాశాలలో అధిక మొత్తంలో బుక్స్, యూనిఫాంలో పేరుతో వసూలను అరికట్టాలని
రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ,బీసీ బాలికల వసతి గృహాలలో సానిటరీ డిస్పోజల్ మిషన్స్ ను ఏర్పాటు చేయాలి. 2019 - నుంచి పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ ను వెంటనే విడుదల చేయాలి. పభుత్వ హాస్టల్స్ లో మెస్ ఛార్జుకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలి.
ప్రస్తుత ఉద్యోగాలకు అనుగుణంగా సిలబస్ లను మార్పు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చూడాలి. ఆర్టీసీ బస్సు పాసుల కిలోమీటర్ల పరిధిని పెంచాలి, అలాగే బస్సు పాస్ చార్జీలు తగ్గించాలి.
రాష్ట్రవ్యాప్తంగా బడి బస్సులను మరల నీదిపేలా చెయ్యాలి.
రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని యూనివర్సిటీలకు నిధులు పెంచి, వెంటనే విడుదల చేయాలి.
రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన కళాశాలల సమయాన్ని ఉదయం 9:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు జరిగే విధంగా కఠిన చర్యలు తీసుకోవాలి..
యు జి సి ఆదేశాల మేరకు మరియు సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా స్కాలర్షిప్స్ ఫీజు రియంబర్స్మెంట్ కు సంబంధం లేకుండా కళాశాలలు విద్యార్థుల తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను విద్యార్థులకు ఇవ్వాలి.
రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలలో మరియు కళాశాలలో ఉదయం పూట వందేమాతరం, మా తెలుగు తల్లి, జనగణమన గీతాలాపన చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి.
నామమాత్రంగా నడుస్తున్న బిఈడిని బలోపేతం చేయాలి.
యూనివర్సిటీలలో రెండో విడత మూడో విడత జరిగే అడ్మిషన్స్ ఆన్లైన్ లో కాకుండా యూనివర్సిటీలోనే ఆఫ్లైన్ అడ్మిషన్స్ జరిగేలా చూడాలని
పాఠశాలలో మరియు కళాశాలలో స్పోర్ట్స్ కేటాయించిన సమయంను ఆటలుకే కేటాయించి విద్యార్థుల మానసికంగా ఉండేలా చెయ్యాలి. ఈ కార్యక్రమంలో ఆంధ్ర విద్యార్థి సంఘం. నియోజకవర్గ కన్వీనర్ సోమనాథ్ రెడ్డి.టౌన్ ప్రెసిడెంట్ ప్రసన్నకుమార్. యుగంధర్ మహేంద్ర తదితర పాల్గొన్నారు.

# రెగ్యులర్ తర్వాతే కొత్త నియామకాలు చేపట్టాలి

**☛ కాంట్రాక్ట్ అధ్యాపకుల డిమాండ్**

**☛ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పణ**

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను ముందుగా రెగ్యులర్ చేసిన తర్వాతే కొత్త నియామకాలు చేపట్టాలని రాయలసీమ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ (టైమ్‌స్కేల్, కాంట్రాక్ట్, అడహాక్) అసోసియేషన్ డిమాండ్ చేసింది. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా




గురువారం వర్సిటీ ప్రధాన ద్వారం వద్ద ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి అధ్యాపకులు వినతిపత్రం సమర్పించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ పి. శ్రీనివాసులు, అధ్యక్షుడు డాక్టర్ పి. నాగరాజు, కార్యదర్శి డాక్టర్ బి. సాయినాథ్ మాట్లాడుతూ... ఉద్యోగ భద్రత ఏది?: దశాబ్దాలుగా యూనివర్సిటీల పురోగతికి కృషి చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు ఇప్పటికీ ఉద్యోగ భద్రత లేకపోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు తీర్పులు అమలు చేయాలి: 'సమాన పనికి సమాన వేతనం' చెల్లించాలని రాజ్యాంగ నిబంధనలు, ఉన్నత న్యాయస్థానాలు స్పష్టమైన తీర్పులు ఇచ్చినప్పటికీ తమకు న్యాయం జరగడం లేదన్నారు. ప్రభుత్వానికి విజ్ఞప్తి: తమ విద్యార్హతలు, సుదీర్ఘ అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని వెంటనే రెగ్యులర్ చేసి తమ కుటుంబాలకు భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, కాంట్రాక్ట్ అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# నీట్ పేపర్ లీకేజీకి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి -- ప్రజాసంఘాల డిమాండ్



బేతంచెర్ల పల్లె వెలుగు ప్రతినిధి (జులై 23 ):- నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటన దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిందని, ఈ ఘటనకు కేంద్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. నీట్ పేపర్ లీకేజీపై సమగ్ర విచారణ జరిపి అసలు దోషులను కఠినంగా శిక్షించాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని కోరుతూ బేతంచెర్ల పోస్టాఫీస్ అధికారికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సుబ్బారాయుడు, సీఐటీయూ టౌన్ నాయకులు రామాంజనేయులు, రైతు సంఘం మండల కార్యదర్శి రామ్మోహన్, డీవైఎఫ్ఐ నాయకులు మధు శేఖర్ మాట్లాడుతూ, దేశంలో అత్యంత కీలకమైన ప్రవేశ పరీక్ష అయిన నీట్‌లో ప్రశ్నాపత్రం లీక్ కావడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. విద్యార్థులు ఎన్నో సంవత్సరాలు కష్టపడి చదివి పరీక్షలకు సిద్ధమవుతుంటే, పరీక్షల భద్రతను కాపాడడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. నీట్ పేపర్ లీకేజీ ఘటనపై స్వతంత్ర, పారదర్శక విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన పరీక్షా విధానాన్ని అమలు చేయాలని, విద్యార్థుల భవిష్యత్తును రక్షించే చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జె. శ్రీనివాసులు, డి. అయ్యన్న, జి. శ్రీనివాసులు, బి. మద్దిలేటి, జార్జి పాల్గొన్నారు.

# రేపే గడువు.. బీఎల్ఓలకు కీలక ఆదేశాలు.





పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఓటరు వివరాల సేకరణకు శుక్రవారం (జూలై 24) చివరి గడువు కావడంతో, బీఎల్ఓలు ఇప్పటివరకు నిర్వహించిన క్షేత్రస్థాయి డేటా సేకరణ, పెండింగ్ దరఖాస్తులు, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పుల పురోగతిపై గురువారం నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.
మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న ప్రతి బీఎల్ఓ సేకరించిన వివరాలను సమీక్షించి, మిగిలిన పనులను గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఇంటింటి పరిశీలన చేపట్టి, ప్రతి అర్హుడి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల దరఖాస్తులను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పరిశీలించి, గడువు ముగిసేలోపు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని బీఎల్ఓలకు స్పష్టం చేశారు. పారదర్శకత, ఖచ్చితత్వంతో విధులు నిర్వహించి నాణ్యమైన ఓటరు జాబితా రూపొందించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ కె. కళ్యాణి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ శేఖర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విక్రమ్, శభరిష్, మున్సిపల్ సిబ్బంది, బీఎల్ఓలు పాల్గొన్నారు.

## నల్లమల అడవులను సందర్శించిన ఫారెస్ట్ అధికారి సి, చైతన్య కుమార్ రెడ్డి.

రుద్రవరం. పల్లె వెలుగు : రుద్రవరం అటవీ రేంజ్ లోని నల్లమల అడవులను నంద్యాల జిల్లా ఫారెస్ట్ అధికారి సి చైతన్య కుమార్ రెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రుద్రవరం రేంజ్ పరిధిలోని డి వని పెంట సెక్షన్ పరిధిలోని 70 హెచ్ ఏ, సిపి ప్లాంటేషన్ ను సందర్శించి మొక్కలు నాటు పనులు తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అనంతరం నూతల, రుద్రవరం సెక్షన్ ల పరిధిలోని అటవీ ప్రాంతాన్ని తనిఖీ చేసుకొని అడవులు మరియు వన్య ప్రాణుల సంరక్షణకు సంబంధించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఆయన వెంట సబ్ డిఎఫ్ ఓ శ్రీనివాసరెడ్డి, రేంజి ఆఫీసర్ ముర్తుజావలి, సెక్షన్ ఆఫీసర్లు రామకృష్ణ, జేమ్స్ పాల్, బాబు ఖాన్, బీటు ఆఫీసర్లు సురేంద్ర గౌడ్, నాగేష్, నరసింహారెడ్డి సిబ్బంది ఉన్నారు.





## మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు కడియం సాంబశివుడు ను పరామర్శించిన మాజీ శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి .



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు కడియం సాంబశివుడు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో అనిల్ న్యూరో కేర్ హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్న విషయాన్ని నేడు మాజీ శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి గారు తెలుసుకుని హాస్పిటల్లో వారిని పరామర్శించి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు... వారి వెంట బుల్లెద్దుల రవికుమార్,నంద్యాల జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ రెడ్డి, జిల్లా వైసీపీ అధికార ప్రతినిధి అనిల్ అమృతరాజ్, నంద్యాల మండలం వైసిపి అధ్యక్షుడు బసవేశ్వర రెడ్డి, వైసీపీ నాయకులు సాయిరాం రెడ్డి, కడియం తిమోతి తదితరులు పాల్గొన్నారు.

## రాంకో సిమెంట్ కాలుష్య బాధిత రైతులకు న్యాయం చేస్తాం -- మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

కొలిమిగుండ్ల ( జులై 23 పల్లె వెలుగు న్యూస్) రిపోర్టర్ మహేష్ :– కొలిమిగుండ్ల మండల కేంద్రంలోని కలవటాల సమీపంలో ఏర్పాటైన రాంకో సిమెంట్ పరిశ్రమ కాలుష్యం కారణంగా నష్టపోయిన రైతులకు న్యాయం చేయడానికి రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఇప్పటికే పలుమార్లు రైతు సంఘాల నాయకులతో చర్చలు జరిపారని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగ నాయుడు ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనే ఉద్దేశంతో ఆగస్టు 3వ తేదీన రాంకో సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం, రైతు సంఘాల నాయకులు మరియు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సమక్షంలో కీలక సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కాలుష్యం వల్ల నష్టపోయిన రైతులకు తగిన నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకుని వారికి న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని రంగ నాయుడు తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చర్చల ద్వారా సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



## బోగారం నుంచి అదృశ్యమైన వ్యక్తి

**ఆచూకీ తెలిస్తే కీసర పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి**

కీసర, జూలై 23 (పల్లె వెలుగు): కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటనపై పోలీసులు మాన్ మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా కునూర్ మండలం కేసారం గ్రామం బాలంపల్లికి చెందిన ఆర్. రాములు (55) ఈ నెల 30న తన భార్య రొండ్ల పర్వతమ్మతో కలిసి ఘట్‌కేసర్ వరకు వచ్చారు. అనంతరం బోగారం గ్రామంలో ఉన్న తన మరదలింటికి వెళ్తానని చెప్పి వెళ్లారు. అదే రోజు రాత్రి అక్కడి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిన ఆయన అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో భార్య పర్వతమ్మ ఫిర్యాదు మేరకు కీసర పోలీసులు మాన్ మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆర్. రాములు ఆచూకీ ఎవరికైనా తెలిసినట్లయితే వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు లేదా కీసర పోలీస్‌స్టేషన్ ఫోన్ నంబర్లు 8712662107, 8712662191, 8712662115, 8712579284కు సమాచారం అందించాలని పోలీసులు ప్రజలను కోరారు.



# సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

**పౌర సేవలు సున్నా**

బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూలై 23: బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న లింగాపురం గ్రామంలోని 8 మంది సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. ఐ వి ఆర్ ఎస్ ( ఇంట్రాక్టివ్ వెరిఫికేషన్ రెస్పాన్స్ సిస్టం ) ద్వారా సచివాలయ సిబ్బంది పనితీరుపై ఫిర్యాదులు వెళ్లాయి. ఈ విషయంపై కొందరు గ్రామస్తులు కూడా ఫిర్యాదు చేసినట్లుగా సమాచారం. గ్రామంలో ఐదు మంది వ్యక్తులకు ఐ వి ఆర్ ఎస్ కాల్స్ వెళ్లిన నేపథ్యంలో సిబ్బంది అందుబాటులో లేరని,పనితీరు సరిగా లేదని వ్యక్తులు కాల్స్ నొక్కారు. ఈ కారణంగా సచివాలయ సిబ్బందికి సున్నా ఫలితాలు ప్రకటిస్తూ షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆత్మకూరు డివిల్డిఓ అన్వరా బేగం గురువారం సాయంత్రం లింగాపురం గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. సచివాలయంలోని రికార్డులు సిబ్బంది హాజరు ప్రజలకు అందుతున్న పౌర సేవలు పెండింగ్ దరఖాస్తులను ఆమె పరిశీలించారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు సకాలంలో సేవలు అందించడం లేదని విధి నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతూ ఉందని ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. సిటిజన్ ఫీడ్ బ్యాక్ రిజిస్టర్ను కూడా సిబ్బంది సక్రమంగా అమలు చేయడం లేదని డి ఎల్ డి ఓ విచారణలో తేలింది. ప్రజల అసంతృప్తి పరంగా సిబ్బంది పనితీరుకు 0 మార్కులు ఇస్తూ సంబంధిత సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రజలకు ఇలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించాలని సిబ్బందికి సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఫలితాలే పునరావృతమైతే శాఖా పరంగా కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని సచివాలయ సిబ్బందిని డివిల్డిఓ అన్వరా బేగం హెచ్చరించారు.



**ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించిన డీఎల్డీవో**

లింగాపురం గ్రామ సచివాలయాన్ని సందర్శించిన డీఎల్డీవో అనంతరం బండి ఆత్మకూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని కూడా సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను ఆమె పరిశీలించారు. ప్రజలకు సేవలు అందించడంలో అధికారులు ముందంజలో ఉండాలని, ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకునేందుకు వెనుకాడే ప్రసక్తే లేదని డివిల్డిఓ హెచ్చరించారు. ఎంపీడీవో గాయత్రి, డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి డి ఎల్ డి వో అన్వరా బేగం సందర్శనలో పాల్గొన్నారు.

## ఆదోని రెవెన్యూ డివిజన్ అధికారి కె. అరుణ దేవి ని కలిసిన ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి



ఎమ్మిగనూరు పల్లె వెలుగు జులై 23 ఇటీవల ఆదోని రెవెన్యూ డివిజన్ అధికారిగా (=ఖా) బాధ్యతలు స్వీకరించిన కె. అరుణ దేవి ఎమ్మిగనూరులోని ఆర్‌డబీ అతిథి గృహంలో ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి నూతన బాధ్యతలు చేపట్టిన ఆర్డీవో కి శుభాకాంక్షలు తెలియజేసి, ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాలకు సంబంధించిన రెవెన్యూ సమస్యలు, భూ వివాదాల పరిష్కారం, ప్రజలకు వేగవంతమైన సేవల అందజేత, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు మరియు వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. ప్రజలకు పారదర్శకంగా, జవాబుదారీతనంతో కూడిన పరిపాలన అందిస్తూ, రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. నియోజకవర్గ ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయడంలో పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాల తహసీల్దార్లు (వీ=ాలు), స్థానిక ప్రజాప్రతినిధులు మరియు నాయకులు పాల్గొన్నారు.

# భీమా ఆరోగ్య సేవ కేంద్రంకు విశేష స్పందన

- **ఎమ్మెల్యే వై, బాలనాగిరెడ్డి పుట్టినరోజు ,**
- **రాంపురంలో ఉచిత వైద్య శిబిరం,**
- **శ్రీ చక్ర హాస్పిటల్ కర్నూలు మరియు నవోదయ హాస్పిటల్,**
- **రాయచూర్ వారి నేతృత్వంలో మెగా శిబిరం**
- **డాక్టర్ల విభాగం అధ్యక్షులు డాక్టర్ శ్రీ బి ధశరథ రామిరెడ్డి అధ్యక్షతన ఏర్పాట్లు,**

ఎమ్మిగనూరు పల్లె వెలుగు జూలై 23 మంత్రాలయం ఎమ్మెల్యే వై, బాలనాగిరెడ్డి పుట్టినరోజు సందర్భంగా గురువారం మంత్రాలయం మండలం రాంపురం గ్రామంలో నియోజకవర్గ డాక్టర్ల విభాగం అధ్యక్షులు డాక్టర్ శ్రీ బి ధశరథ రామిరెడ్డి అధ్యక్షతన శ్రీ చక్ర హాస్పిటల్ కర్నూలు మరియు నవోదయ హాస్పిటల్ రాయచూర్ వారి నేతృత్వంలో 85 డాక్టర్ల పర్యవేక్షణలో బీమా ఆరోగ్య సేవ కేంద్రం (ఉచిత వైద్య శిబిరం)కు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆయన ధశరథ రామిరెడ్డి మాట్లాడుతూ, ఓటమి ఎరుగని ధీరుడు,పేదల పెన్నిది, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఎమ్మెల్యే శ్రీ వై బాలనాగిరెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఈ బీమా ఆరోగ్య సేవ కేంద్రం ద్వారా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం చాలా శుభ పరిణామం అని, మారుమూల గ్రామాల్లోని జనం సైతం ఈ క్యాంపుకు రావడం జరిగిందని, రానున్న రోజుల్లో మరిన్ని వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ధశరథ రెడ్డి శ్రీ చక్ర హాస్పిటల్ కర్నూలు మరియు నవోదయ హాస్పిటల్ రాయచూర్ వారి యాజమాన్యంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బాబురెడ్డి, మోహన్ రెడ్డి, యువనేతలు ఉమేష్ రెడ్డి,సూరజ్












వైకాపా జిల్లా కార్యదర్శులు విశ్వనాథ రెడ్డి,మురళీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రెస్ క్లబ్బు కు స్థలమున కేటాయించండి

**-ఆంధ్రప్రదేశ్ వడ్డెర సంఘం నాయకుడు చల్లా వెంకటేశ్వర్**

నంద్యాల ప్రతినిధి. పల్లె వెలుగు జూలై 23 . ):నంద్యాల నంద్యాల జిల్లా అయిన కూడా ప్రెస్ క్లబ్బు లేదు మరి ఎన్ని ప్రభుత్వాలు మారినాయి ఎంత మంది రాజకీయ నాయకులు మారి ఉండొచ్చు మరి ఇంతవరకు పాత్రికేయులకు 10 సెంట్ల స్థలం ఇవ్వ లేకుండా ఉన్నారని ఏపీ వడ్డెర సంఘం నాయకుడు చల్లా వెంకటేష్ అన్నారు. నంద్యాల జిల్లాలో 30 ఏళ్ల నుండి పాత్రికేయులు అడుగుతున్న కూడా ఇంతవరకు ఏ రాజకీయ నాయకుడు పట్టించుకోలేదు ప్రభుత్వం మారుతున్న పాటించుకోవడం లేదు అని గురువారం నాడు సంఘము కార్యాలయంలో మాట్లాడారు. ఏ ఒక్కరూ స్పందించడం లేదని ఫ్రీగా వార్తలు అయితే ఫ్రీగా మాట్లాడతారు ఫ్రీగానే వాడుకుంటారు తప్ప పాత్రికేయులకు అందరికీ ఉపయోగపడేటట్టు స్థలమున ఇవ్వండి 30 లక్షలు ప్రభుత్వం నుంచైనా ఇప్పివ్వండి అని అన్నారు. ఎన్ని సార్లు రాజకీయ పార్టీలు మారిన కూడా ప్రెస్ క్లబ్ కు స్థలం ఇవ్వాలంటే అదిగో ఇదిగో అని చెప్పడం తప్ప ఆచరణలో లేదు అని అన్నారు. నంద్యాల జిల్లాలో ఇంతవరకు ప్రెస్ క్లబ్బు కూడా లేకపోవడం సిగ్గుచేటని అన్నారు. 50 ఏళ్ల నుంచి రాజకీయాలు చేస్తున్నారు వార్తలు రాస్తున్నారు విలేకరులకు గాని మీడియా కు గాని రక్షణ లేదు ఇండ్లు లేవు స్థలాలు లేవు ఎన్నిసార్లు మీడియాపై విలేకరులపై దాడి జరిగిన కూడా ఒక్క ముద్దాయి పైన కూడా ఎటువంటి చర్య తీసుకోలేదు. రాయడానికి ఫ్రీగా రాపిచ్చుకుంటారు వార్తలు కొట్టడానికి తిట్టడానికి ఎవరన్నా వస్తే ప్రభుత్వమే గట్టి చర్యలు తీసుకోవాలని అన్నారు



# విజయవాడలో రాష్ట్ర స్థాయి జర్నలిస్టుల క్రికెట్ టోర్నమెంట్

☛ జూలై 24 నుండి 26 వరకు లయోలా కళాశాల మైదానంలో పోటీలు

☛ కర్నూలు జిల్లా జర్నలిస్టుల జట్టు ప్రకటన: కెప్టెన్‌గా వి

**ఆదోని రూరల్ పల్లె వెలుగు**

ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ (ఏపీజేఎస్ఏ) ఆధ్వర్యంలో ఈ నెల 24, 25, 26



తేదీలలో విజయవాడలోని ప్రముఖ లయోలా కళాశాల ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి జర్నలిస్టుల క్రికెట్ టోర్నమెంట్‌ను అత్యంత ఘనంగా నిర్వహించనున్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు, ఉమ్మడి కృష్ణా జిల్లా జర్నలిస్ట్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, స్థానిక జర్నలిస్టు మిత్రుల సహకారంతో ఈ మెగా టోర్నమెంట్‌ను ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్నారు.

**పోటీలకు కర్నూలు జిల్లా జట్టు సిద్ధం:**

ఈ రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు కర్నూలు జిల్లా నుంచి క్రీడాకారుల ఎంపిక పూర్తయింది. ఈ జట్టు వివరాలను అసోసియేషన్ ప్రతినిధులు వెల్లడించారు. కర్నూలు జిల్లా అధ్యక్షులు మధు సుధాకర్ నేతృత్వంలో వైస్ ప్రెసిడెంట్‌గా పి. నాగేంద్రుడు వ్యవహరిస్తుండగా, జట్టు కెప్టెన్‌గా ఆదోని మండలానికి చెందిన వీరుపాక్షరెడ్డి ఎంపికయ్యారు. ఈ టోర్నమెంట్‌లో ప్రతిభ చాటి జిల్లాకు విజయాన్ని అందించేందుకు కర్నూలు జర్నలిస్టుల జట్టు ఉత్సాహంగా




సిద్ధమవుతోంది.

**మూడు రోజుల షెడ్యూల్ వివరాలు:**

జూలై 24 (శుక్రవారం): రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి పాల్గొనే జర్నలిస్టులు శుక్రవారం సాయంత్రం 5:00 గంటల లోపు విజయవాడకు చేరుకోవాల్సి ఉంటుంది. అనంతరం కేటాయించిన గదుల్లో బస కల్పిస్తారు. రాత్రి 7:00 గంటలకు జర్నలిస్టుల కోసం ప్రత్యేకంగా డీజే కార్యక్రమం, విందు ఏర్పాటు చేశారు.

*జూలై 25 (శనివారం): ఉదయం 7:00 గంటలకు అల్పాహారం అనంతరం, ప్రతి జిల్లా నుంచి పాల్గొనే 16 మంది జర్నలిస్టు క్రీడాకారులకు టీ-షర్టులు, లోయర్లు అందజేస్తారు. అనంతరం ఉదయం 8:30 గంటల నుండి లయోలా కళాశాల గ్రౌండ్‌లో క్రికెట్ మ్యాచ్‌లు అధికారికంగా ప్రారంభమవుతాయి.*



**జర్నలిస్టులకు ముఖ్య సూచనలు:**

టోర్నమెంట్‌లో పాల్గొనే ఉమ్మడి 13 జిల్లాలకు చెందిన జర్నలిస్టులు తమ వెంట అక్రిడిటేషన్ కార్డు జిరాక్స్ కాపీని తప్పనిసరిగా తీసుకురావాలని నిర్వాహకులు స్పష్టం చేశారు. చాలా రోజుల తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టు మిత్రులంతా ఒకే వేదికపై కలుసుకునే ఈ అపూర్వ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని, సమయపాలన పాటిస్తూ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు బోళ్ల సతీష్ బాబు, రాష్ట్ర అధ్యక్షులు ఓబులం ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వనిత శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వేణు, ట్రెజరర్ తలారి పెద్దప్ప, ప్రచార కార్యదర్శి తలారి నాగలింగస్వామి, రాష్ట్ర కమిటీ సభ్యులు నాగవర్ధన్ రెడ్డి, ఓబులంపల్లి రామకృష్ణ, వలపర్ల సురేష్, రాష్ట్ర కమిటీ నాయకులు పీతల అప్పాజీ, విజయవాడ ఉమ్మడి జిల్లా కమిటీ సభ్యులు హృదయపూర్వకంగా విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాల కోసం 9885999727 నంబరును సంప్రదించవచ్చని తెలిపారు.

# డోన్ బీసీ బాలికల హాస్టల్‌కు రూ.25 వేల విలువైన నీటి ట్యాంకు విరాళం

**సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పవన్ సేవాభావానికి ప్రశంసలు**



డోన్ పట్టణానికి చెందిన ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ లిపవన్‌లి సామాజిక బాధ్యతతో డోన్ బీసీ బాలికల హాస్టల్‌కు లి2 వేల లీటర్ల సామర్థ్యం గల నీటి ట్యాంకునులి సుమారు లిరూ. 25 వేలలి విలువతో విరాళంగా అందజేశారు. హాస్టల్‌లో నివసిస్తున్న విద్యార్థినులకు తాగునీరు, ఇతర అవసరాల కోసం నీటి నిల్వ సౌకర్యం మెరుగుపడేలా ఈ ట్యాంకును అ ం ద ్ జ ే య ్ ా డ ్ ం అభినందనీయమని స్థానికులు కొనియాడారు. ఈ విరాళం ద్వారా హాస్టల్ విద్యార్థినులకు ఎంతో ఉపయోగం కలగనుంది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో లిడోన్ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇంతియాజ్ భాష, లిలిసబ్ జైలు ఇన్‌స్పెక్టర్ సురేష్‌లి పాల్గొని, పవన్ సేవాభావాన్ని ప్రశంసించారు. సమాజంలోని ఇతర దాతలు కూడా విద్యార్థుల సంక్షేమం కోసం ఇలాంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. పవన్ చేసిన ఈ ఉదార విరాళానికి హాస్టల్ నిర్వాహకులు, సిబ్బంది, విద్యార్థినులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లిడోన్ ఇండోర్ సెటిల్ సభ్యులు జహీర్, జయరంగా రెడ్డి, కర్ణాకర్, శ్రీకాంత్‌లితో పాటు బీసీ బాలికల హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్డీఏ ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవం

**ఇంటింటికీ ప్రచార కార్యక్రమంపై సమీక్ష నిర్వహించిన, ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి ,**





ఎమ్మిగనూరు పల్లె వెలుగు జూలై 23 ఎమ్మిగనూరులోని ఆర్‌డబీ అతిథి గృహంలో నిర్వహించిన –"ఎన్డీఏ ప్రభుత్వంరెండేళ్ల విజయోత్సవంఇంటింటికీ ప్రచార కార్యక్రమంపై ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి మండల, పట్టణ కమిటీలు, క్లస్టర్
కన్వీనర్లు మరియు పార్టీ నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి కార్యక్రమం అమలుపై కార్యకర్తలకు సమగ్ర దిశానిర్దేశం చేస్తూ, వీఎణూ యాప్‌ను సమర్థవంతంగా ఉపయోగించి ప్రతి ఇంటిని సందర్శించాలని సూచించారు. ప్రతి బూత్, యూనిట్, క్లస్టర్ కన్వీనర్, గ్రామ మరియు వార్డు కమిటీ నాయకులు తప్పనిసరిగా ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజలను నేరుగా కలవాలని ఆదేశించారు.
కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా, దీపం–2, స్త్రీ శక్తి, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, సీఎంఆర్‌ఎఫ్, పెన్షన్లు మరియు ఇతర సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులకు వివరించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరవేసి ప్రజలతో మరింత బలమైన అనుబంధాన్ని ఏర్పరచుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో టీడీపీ ఎమ్మిగనూరు పరిశీలకులు ముని శేఖర్ రెడ్డి , మండల మరియు పట్టణ కమిటీ సభ్యులు, క్లస్టర్ కన్వీనర్లు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కీసరగుట్ట రామలింగేశ్వరుడికి భక్తుల కానుకల వెల్లువ

**ఐదు నెలల్లో హుండీ ఆదాయం రూ.19.05 లక్షలు**



కీసర, జూలై 23 (పల్లె వెలుగు): ప్రముఖ పుణ్యక్షేత్రం కీసరగుట్టలోని శ్రీ భవానీ శివదుర్గ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామివారికి భక్తుల భక్తిశ్రద్ధలు కానుకల రూపంలో వెల్లువెత్తుతున్నాయి. మార్చి నుంచి జులై వరకు ఐదు నెలల కాలంలో ఆలయ హుండీల ద్వారా రూ. 19,05,531 ఆదాయం సమకూరినట్లు దేవస్థాన అధికారులు వెల్లడించారు. గురువారం ఆలయ ప్రాంగణంలో హుండీలను తెరిచి నగదు లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అధికారుల పర్యవేక్షణలో పారదర్శకంగా సాగిన ఈ ప్రక్రియలో భక్తులు సమర్పించిన నగదు, నాణేలు తదితర కానుకలను ప్రత్యేక బృందాలు క్షుణ్ణంగా లెక్కించి మొత్తం ఆదాయాన్ని నమోదు చేశారు. తెలంగాణలో ప్రముఖ శైవక్షేత్రంగా పేరుగాంచిన కీసరగుట్ట దేవస్థానానికి ప్రతి నెల వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. భక్తుల విశ్వాసానికి నిదర్శనంగా హుండీ ఆదాయం నెలనెలా పెరుగుతుండటం విశేషం. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ తటాకం వెంకటేష్ శర్మ, కార్యనిర్వహణాధికారి కె. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, భక్తులు సమర్పిస్తున్న విరాళాలను ఆలయ అభివృద్ధి, నిర్వహణతో పాటు భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాల కల్పనకు వినియోగించనున్నట్లు తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# కుమార్తె పెళ్లిళ్లకు చేసిన అప్పులు తీరక.. గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య గ్రామంలో తీవ్ర విషాదం

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కుమార్తెల వివాహాల కోసం చేసిన అప్పులు తీరకపోవడం, కుటుంబంలో మనస్పర్థల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి గడ్డి మందు తాగి



ఆత్మహత్య చేసుకున్న సంఘటన బొల్లవరం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బొల్లవరం గ్రామానికి చెందిన బోయ రామాంజనేయులు (56) (తండ్రి: చిన్న బజారు) తన ఇద్దరు కుమార్తెలకు వివాహాలు చేశాడు. అయితే, పెళ్లిళ్ల ఖర్చుల కోసం చేసిన అప్పులు తీర్చలేక కొంతకాలంగా తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యాడు. ఈ క్రమంలోనే మద్యపానానికి బానిసయ్యాడు. ఈ విషయమై గురువారం (లేదా సంబంధిత రోజు) భర్తను తాగుడు మానాలని భార్య రామేశ్వరమ్మ హెచ్చరించడంతో, మనస్తాపం చెందిన రామాంజనేయులు ఇంట్లో ఉన్న గడ్డి మందు (పురుగుల మందు) తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక రామాంజనేయులు మృతి చెందాడు. మృతుడి భార్య రామేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు. రామాంజనేయులు మృతితో గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి.

# పల్లె వెలుగు కథనానికి స్పందించిన అధికారులు..

**కూలీల సహాయంతో చెరువులో పిచ్చి మొక్కల తొలగింపు**



పల్లె వెలుగు కథనానికి స్పందించిన అధికారులు..

**హోళగుంద పల్లె వెలుగు జులై :23** పల్లె వెలుగు దినపత్రికలో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించి, హోళగుంద మండలం గజ్జహళ్లి గ్రామ త్రాగునీటి చెరువులో కూలీల సహాయంతో పిచ్చి మొక్కలు, కలుపు మొక్కలను తొలగించే పనులు చేపట్టారు. కాల్వకు నీరు వస్తున్న నేపథ్యంలో, చెరువును ముందుగా శుభ్రపరచాలని గ్రామస్థులు చేసిన విజ్ఞప్తిని అధికారులు పరిగణనలోకి తీసుకుని చర్యలు ప్రారంభించారు. కూలీలు చెరువులోకి దిగి పిచ్చి మొక్కలను పూర్తిగా తొలగిస్తూ శుభ్రపరిచే పనులు నిర్వహించారు. త్వరలో కాల్వ నీటిని చెరువులోకి విడుదల చేసి తాగునీటి నిల్వలు ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యను వెలుగులోకి తీసుకొచ్చిన పల్లె వెలుగు కథనానికి స్పందించి వెంటనే చర్యలు చేపట్టిన అధికారులను గ్రామస్థులు అభినందించారు.

# దళిత సీఐపై వివాదాస్పద వ్యాఖ్యల అంశంలో వైసీపీ నేత జక్కంపూడి రాజాకు నోటీసులు..!

సీఐ శేషయ్యపై జక్కంపూడి రాజా అవమానకర వ్యాఖ్యలు చేశారని ఆరోపణలు. జక్కంపూడి వ్యాఖ్యలపై ఎస్సీ కమిషన్ ఆదేశాలతో కేసు నమోదు చేసి విచారణ వేగవంతం చేసిన పోలీసులు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com